Visit us @ www.sooryasena.com

RNI.No.: TELTEL/2023/85598

# సూర్యసేన

మా అక్షరం ప్రజల మార్పు కోసం

తెలుగు దిన పత్రిక

Published from: Nalgonda - Hyderabad - Warangal - Khammam - Karimnagar - Mahabubnagar - Vijayawada - Guntur - Kurnool

శుక్రవారం FRIDAY || 30.01.2026 || నల్గొండ NALGONDA || సంపుటి (Volume): 3 సంచిక (Issue) : 151 || పేజీలు (Pages) : 8 వెల (Rs.) : 2/- || ఎడిటర్: పాల్వాయి జానయ్య Editor: Palvai Janaiah






# గద్దెపైకి సమ్మక్క

**వరంగల్ జనవరి, 29 (సూర్యసేన ప్రత్యేక ప్రతినిధి):** కోట్లాది భక్తుల ఆరాధ్య దైవం.. భక్తుల కొంగు బంగారం సమ్మక్క తల్లి మేడారం గద్దెపై కొలువుదీరింది. ఆదివాసీ సంప్రదాయాల మధ్య అట్టహాసంగా పూజారులు గురువారం రాత్రి చిలుకలగుట్ట నుంచి కుంకుమ భరిణె రూపంలో ఉన్న తల్లిని తెచ్చి ప్రతిష్టించారు. దీంతో మేడారం మహా జాతరలో ప్రధాన ఘట్టం మొదలై జాతర పతాకస్థాయికి చేరింది. అశేష భక్త జనం జయజయధ్వానాలు, కేరింతల నడుమ చిలుకలగుట్ట నుంచి సమ్మక్క సాయంత్రం 6.15 గంటలకు బయలుదేరింది. ములుగు జిల్లా ఎస్పీ రామ్‌నాథ్ కేనన్ గాల్లోకి కాల్పులు జరిపి అధికారికంగా తల్లిని స్వాగతించారు. ప్రధాన పూజారి కొక్కెర కిష్టయ్య నేతృత్వంలో పూజారుల బృందం చిలుకలగుట్టపై ఉన్న సమ్మక్క రూపమైన కుంకుమ భరిణెకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన పూజారి కిష్టయ్య ఒక్కరే గుట్టపైకి వెళ్లి పూజచేశారు. పూజ పూర్తయిన తర్వాత తల్లి స్వరూపాన్ని తీసుకుని కిందకు వస్తున్న సంకేతం చేరవేయడంతో ఎస్పీ కేనన్ తుపాకీతో గాల్లోకి కాల్పులు జరిపారు. ప్రధాన పూజారి కిష్టయ్యతోపాటుగా మిగతా పూజారులు తల్లిని తీసుకుని గుట్ట దిగగానే మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, జిల్లా కలెక్టర్ దివాకర స్వాగతం పలికారు. ఈ అద్భుత ఘట్టాన్ని తిలకించేందుకు లక్షలాదిగా తరలివచ్చి ఎంతో ఉత్కంఠగా ఎదురుచూస్తున్న భక్తులు ఒక్కసారిగా కేరింతలు కొట్టడంతో ఉద్విగ్న వాతావరణం నెలకొంది. గుట్టపైనుంచి సమ్మక్కను తీసుకవస్తుండగా ఆదివాసీ కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఉర్రూతలూగించాయి. డోలు వాయిద్యాలతో నృత్యాలు, ఆటా, పాటలతో భక్తజన పారవశ్యంతో మేడారం పరిసరాలన్నీ ఉప్పొంగిపోయాయి.

లక్షలాది భక్తులు వెంటరాగా పూజారులు సమ్మక్క తల్లిని గుట్టనుంచి గద్దెపైకి తీసుకువచ్చారు. దారిపొడవునా భక్తులు మంగళ హారతులు పట్టారు. కోళ్లు, మేకలు, గొర్రెలు బలిచ్చారు. సమ్మక్క తల్లి వచ్చే మార్గమంతా రక్తంతో తడిచిపోయింది. దారికి ఇరువైపులా భక్తులు గుమిగూడి అమ్మవారికి దండాలు పెట్టుకున్నారు. పూజారులను తాకి తన్మయత్వం చెందేందుకుయత్నించారు. శివసత్తుల పూనకాలు, భక్తి పారవశ్యంతో ఊగిపోయే భక్తులను నియంత్రించేందుకు పోలీసులు తంటాలుపడ్డారు. ఐదంచెల భద్రత ఏర్పాటుచేసి రోప్ పార్టీలతో పూజారుల బృందానికి పోలీసులు రక్షణ వలయంగా నిలిచి ముందుకుసాగారు. చిలుకల గుట్టనుంచి సమ్మక్క తల్లి ఆగమనం ఉద్విగ్నశీ, ఉద్వేగంగా మారింది. సమ్మక్క తల్లి రాక కోసం ఎదురుచూస్తున్న జనమంతా ఒక్కసారిగా కేరింతలు, జయజయ ధ్వానాలతో తల్లిని స్వాగతించడంతో భక్తి పారవశ్యం తారాస్థాయికి చేరింది. సమ్మక్క వస్తున్న దారిలో శివసత్తులకు పట్టపగ్గాలూ లేకుండాపోయాయి. తల్లికి స్వాగతం పలికేందుకు ఎదురుచూసే వారిలో మొదటి వరుసలో ఉండే శివసత్తులు ఎదురెళ్లి ప్రణమిల్లి మొక్కుకుంటారు. వీరిని నియంత్రిస్తూ పోలీసులు పూజారులకు రక్షణగా ఉంటూ తల్లిని గద్దెపైకి తీసుకొచ్చారు. భక్తి పారవశ్యంతో ఊగిపోయిన భక్తులు మేడారంలో గద్దెపైకి సమ్మక్క తల్లి చేరుకోవడంతో జాతర ప్రాంగణం ఒక్కసారిగా ఉద్విగ్నంగా మారింది. లైట్లు ఆర్పేసి గద్దెపైకి అమ్మవారిని తెచ్చారు.

అప్పటికే క్యూ లైన్లలో లక్షలాదిగా వేచివున్న భక్తులు దర్శనం కోసం దూసుకొచ్చారు. రెండేళ్లకోసారి వచ్చే జాతరలో తమ కోర్కెలు తీర్చాలంటూ మొక్కులు చెల్లించుకున్నారు. గురువారం మేడారం జాతరను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి, సీతక్క, లక్ష్మణ్, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, జువెల్ ఓరమ్, పిసిసి చీఫ్ మహేశ్, ఉన్నతాధికారులు అమ్మవార్లను దర్శించుకున్నారు. ఉదయంనుంచే చిలుకల గుట్టలో....సమ్మక్క తల్లి కొలువై ఉన్న చిలుకలగుట్ట వద్ద ఉదయం నుంచే పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సమ్మక్క గుడిని శుద్ధి చేసి మామిడి తోరణాలను అలంకరించారు. శక్తి పీఠాన్ని ఎర్రమన్నుతో అలికి ముగ్గులు వేశారు. పూజారులు అడవికి వెళ్లి వెదురు వనం, ఆడేరాలు తెచ్చి గద్దెపై ప్రతిష్ఠించారు. పసుపు, కుంకుమలతో అలంకరించారు. సమ్మక్క తల్లికి పూజలు నిర్వహించే ముందు ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం వెదురు వనానికి పూజలు నిర్వహించి వెదురును గద్దెపైన ప్రతిష్ఠించారు. నియమ, నిష్ఠలతో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఒక్కరోజే 80 లక్షల మంది దర్శనంమేడారంలో గురువారం ఒక్కరోజే తల్లులను 80 లక్షల మంది దర్శించుకున్నట్లు అధికారులు ప్రకటించారు. సమ్మక్క తల్లి గద్దెపైకి చేరుకోకముందే పెద్దఎత్తున దర్శనాలు చేసుకున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే లక్షలాదిగా మేడారం పరిసరాల్లో తిష్టవేసిన భక్తులు మాత్రం సమ్మక్క తల్లి ఆగమనం తర్వాత దర్శనం చేసుకునేందుకు ఎగబడ్డారు.

# కెసిఆర్‌కు నోటీసులు



**హైదరాబాద్, జనవరి, 29 (సూర్యసేన ప్రతినిధి):** ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణలో భాగంగా బిఆర్‌ఎస్ అధినేత, మాజీ సిఎం కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు నోటీసులు ఇచ్చారు. గురువారం నందినగర్‌లోని కెసిఆర్ నివాసానికి సిట్ అధికారులు వెళ్లి ఆయన పి.ఎకు నోటీసులు అందజేశారు. అందులో ప్రధానంగా సిఆర్‌పిసి 160 సెక్షన్ కింద పలు అంశాలను పొందుపరిచారు. శుక్రవారం(జనవరి 30) మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు అందుబాటులో ఉండాలని నోటీసులో స్పష్టం చేశారు. 65 ఏళ్ల వయసు దృష్ట్యా పోలీసు స్టేషన్‌కు రావాల్సిన అవసరం లేదని తెలిపారు. స్వచ్ఛందంగా రావాలనుకుంటే స్వచ్ఛందంగా జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు విచారణకు రావచ్చు లేదా విచారణకు హాజరయ్యేందుకు హైదరాబాద్ పరిధిలోని అనువైన ప్రాంతం వివరాలు తెలపాలని సూచించారు. కెసిఆర్ సూచించిన ప్రాంతానికే సిట్ బృందం వెళ్లి విచారిస్తుందని నోటీసుల్లో పేర్కొన్నారు. ఇప్పటికే ఫోన్ ట్యాపింగ్ కేసులో బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, పార్టీ ముఖ్యనేత హరీష్‌రావు, మాజీ ఎంపి సంతోష్ రావులను ప్రత్యేక దర్యాప్తు బృందం విచారించిన విషయం తెలిసిందే.

**సెక్షన్ 160 సిఆర్‌పిసి అంటే ఏమిటి..?**

సాధారణంగా 65 ఏళ్లు పైబడిన వ్యక్తులు, మహిళలు లేదా మానసిక, శారీరక వికలాంగులను విచారణ కోసం పోలీస్ స్టేషన్‌కు పిలవకూడదు. వారు ఉన్న చోటికే వెళ్లి సాక్ష్యాలను సేకరించాలని ఈ సెక్షన్ చెబుతోంది. దీన్ని అనుసరించే సిట్ అధికారులు కెసిఆర్‌కు ఈ వెసులుబాటు కల్పించారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు కెసిఆర్ ఎక్కడ విచారణకు హాజరవుతారు..? ఆయన ఎలాంటి సమాధానాలు ఇస్తారు..? అన్నది రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠ రేపుతోంది.

**ఇది విచారణ కాదు..**
**ప్రతీకారం: కెటిఆర్**

2వ పేజీ లో...

# మీరే తెలంగాణ బ్రాండ్ అంబాసిడర్లు



**హార్వర్డ్ / హైదరాబాద్, జనవరి, 29 (సూర్యసేన ప్రతినిధి):** హార్వర్డ్ బిజినెస్ స్కూల్లో సిఎం రేవంత్‌రెడ్డి సందడి చేశారు. తన పర్యటనలో భాగంగా సిఎం పలు కీలక సమావేశాలు, అంతర్జాతీయ సంస్థలతో చర్చలు, విద్యార్థులతో ముఖాముఖీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముఖ్యంగా ప్రముఖ హార్వర్డ్ బిజినెస్ స్కూల్లో భారతీయ విద్యార్థులతో జరిగిన భేటీ కార్యక్రమం అనేక వర్గాల్లో చర్చకు దారితీసింది. భారతీయ విద్యార్థుల ప్రత్యేక ఆహ్వానంతో క్యాంపస్‌ను సిఎం రేవంత్ సందర్శించారు. ఈ మేరకు విద్యార్థులతో తన ఆలోచనలను సిఎం రేవంత్‌రెడ్డి పంచుకున్నారు. విద్యార్థులతో జరిగిన చర్చాగోష్ఠిలో సిఎం రేవంత్ తన రాజకీయ ప్రస్థానాన్ని, ఎదుర్కొన్న సవాళ్లను విద్యార్థులకు వివరించారు. విజయం అనేది అదృష్టం వల్ల రాదని నిరంతర కృషి, లక్ష్యం పట్ల స్పష్టత ఉంటేనే సాధ్యమని ఆయన విద్యార్థులకు తెలిపారు. ఎవరికైనా వారి కెరీయర్‌లో ప్రారంభంలో ఎదురయ్యే ఒడిదుడుకులను ఎలా అధిగమించాలో విద్యార్థులకు సిఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. విజన్ తెలంగాణను గ్లోబల్ మ్యాప్‌లో అగ్రస్థానంలో నిలబెట్టడమే తన ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. హైదరాబాద్‌ను కేవలం ఐటీ హబ్‌గానే కాకుండా అన్నిరంగాల్లోనూ మేటిగా తీర్చిదిద్దుతున్నామని సిఎం రేవంత్‌రెడ్డి వివరించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్ట్ గురించి సిఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. తెలంగాణ అభివృద్ధిలో అంతర్జాతీయ ప్రమాణాలను ఎలా పాటిస్తున్నామో ఆయన చెప్పారు. హార్వర్డ్ వంటి ప్రతిష్టాత్మక సంస్థల్లో చదువుతున్న విద్యార్థులు, అంతర్జాతీయ వేదికలపై హైదరాబాద్, తెలంగాణకు బ్రాండ్ అంబాసిడర్లుగా వ్యవహరించాలని సిఎం వారికి పిలుపునిచ్చారు. తెలంగాణలో ఉన్న అద్భుతమైన అవకాశాల గురించి ప్రపంచానికి చాటి చెప్పాలని సిఎం అన్నారు.


## సవాళ్ల నడుమ స్థిరంగా
# వృద్ధిరేటు



**న్యూఢిల్లీ, జనవరి, 29 (సూర్యసేన ప్రతినిధి):** ప్రపంచ సవాళ్లు ఉన్నప్పటికీ భారత్ నిలకడగా పురోగతిని సాధిస్తోందని ఆర్థిక సర్వే 202526 వెల్లడించింది. పార్లమెంట్ బడ్జెట్ సెషన్ ప్రారంభించిన తర్వాత మరుసటి రోజు గురువారం కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో ఆర్థిక సర్వే ప్రవేశపెట్టారు. సంస్కరణలు కొనసాగిస్తుండడం వల్ల వచ్చే ఆర్థిక సంవత్సరానికి(202627) జిడిపి (స్థూల దేశీయోత్పత్తి) 6.8 నుంచి 7.2 శాతం మధ్య ఉండనుంది. ఈ జిడిపి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (202526) జిడిపి అంచనా 7.4 శాతం కంటే తక్కువగా ఉంది. భారత ఆర్థిక వ్యవస్థ నిలకడగా ముందుకు సాగుతోంది. విధానపరమైన స్థిరత్వం, నియంత్రణలో స్పష్టత, మానవ వనరులపై పెట్టుబడులు భారత భవిష్యత్ వృద్ధికి కీలకంగా ఉన్నాయి. భారీ మార్పులకంటే నిరంతర సంస్కరణలే భారత్‌ను ముందుకు నడిపిస్తాయని ఆర్థిక సర్వే స్పష్టం చేసింది. కొనుగోలు ప్రమాణాల ప్రకారం, ప్రపంచ వృద్ధిలో భారత్ వాటా 16 శాతం ఉండటం విశేషం. దీని వల్ల భారత్ ప్రపంచంలో వేగంగా ఎదుగుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతోంది. అయితే, ప్రపంచ వాణిజ్యం మందగించడం, విదేశీ పెట్టుబడులు తగ్గడం వల్ల వృద్ధి ఎక్కువగా దేశీయ డిమాండ్‌పైనే ఆధారపడుతోందని సర్వే హెచ్చరించింది. బ్యాంకులు, కార్పొరేట్ రంగం ఆర్థికంగా మెరుగవడం, ప్రభుత్వ పెట్టుబడులు పెరగడం భారత్‌కు ప్రధాన బలం అని పేర్కొంది. విదేశీ మారక నిల్వలు 701.4 బిలియన్ డాలర్లకు పైగా ఉన్నప్పటికీ, భారత రూపాయి ఆశించిన స్థాయిలో బలపడలేదని సర్వే తెలిపింది. 2020 తర్వాత ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాల కరెన్సీలతో పోలిస్తే రూపాయి ఎక్కువగా నష్టపోయింది. దీనికి ప్రధాన కారణం దేశంలో కరెంట్ ఖాతాలోటు, 2025-26లో ఇది జిడిపిలో సుమారు 1.3 శాతంగా ఉంది.

2వ పేజీ లో...

## యాక్టింగే..
# యాక్షన్ లేదు



**హైదరాబాద్, జనవరి, 29 (సూర్యసేన ప్రతినిధి):** ఫోన్ ట్యాపింగ్ కేసులో జరుగుతున్నది యాక్టింగ్ మాత్రమేనని, యాక్షన్ తీసుకున్నదేమీ లేదని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు ఎద్దేవా చేశారు. నోటీసులు ఇచ్చి పబ్లిసిటీ చేసుకోవడానికే పరిమితమవుతుని అన్నారు.

కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్, గొర్రెల స్కాం వంటి అన్ని అవినీతి కేసులపై సిట్టింగ్ జడ్జితో జ్యుడిషియల్ ఎంక్వైరీ జరగాలని బిజెపి డిమాండ్ చేస్తోంది. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో రాంచందర్ రావు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అవినీతి, స్కాంల విషయంలో కాంగ్రెస్ - బీఆర్ఎస్ పార్టీల మధ్య తీసుకుంటున్న నిర్ణయాలు, వ్యవహార శైలి ఒకే విధంగా కొనసాగుతున్నాయన్న విషయం స్పష్టంగా కనిపిస్తోందని విమర్శించారు.

2వ పేజీ లో...

# ప్రజాస్వామ్య వ్యవస్థలో మీడియా పాత్ర కీలకం.....

**. 2026 క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించిన ఐఅండ్‌పీఆర్ స్పెషల్ కమీషనర్ ప్రియాంక**

**హైదరాబాద్, జనవరి 29 (సూర్య సేన) :** ప్రజాస్వామ్య వ్యవస్థలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని ఐ అండ్ పిఆర్ స్పెషల్ కమీషనర్ సీహెచ్ ప్రియాంక అన్నారు. గురువారం హైదరాబాద్ లోని అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో క్యాంప్ సూర్య సేన తెలుగు దినపత్రిక 2026. క్యాలెండర్, డైరీలను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజల సమస్యలను నిష్పక్షపాతంగా వెలుగులోకి తెచ్చి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి అన్నారు. ప్రభుత్వాలకు ప్రజలకు మధ్య వారిదిగా పత్రికలు ఉండాలన్నారు. అనంతరం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్)వ్యవస్థాపక అధ్యక్షులు, రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య మాట్లాడుతూ... మీడియా సంస్థలు, వాటిలో పనిచేసే జర్నలిస్టులు సమాజంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలను వెలుగులోకి తెస్తూ ప్రజా సమస్యలపై దృష్టి సారించి ప్రజలకు అండగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూర్య సేన తెలుగు దినపత్రిక సంపాదకులు పాల్వాయి జానయ్య, టీడబ్ల్యూజేఎఫ్ హైదరాబాద్ జిల్లా కన్వీనర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



# సవాళ్ల నడుమ స్థిరంగా వృద్ధిరేటు

1వ పేజీ తరువాయి

సేవల రంగం నుంచి వచ్చే మిగులు ఆదాయం, విదేశాల్లో పనిచేసే భారతీయుల నుంచి వచ్చే రిమిటెన్సులు బాహ్య ఒత్తిడిని కొంత మేర తగ్గిస్తున్నాయని సర్వే తెలిపింది.

కేంద్ర ప్రభుత్వ ఆర్థిక స్థితి మెరుగుపడిందని సర్వే తెలిపింది. 2024–25లో ద్రవ్య లోటు జిడిపిలో 4.8శాతానికి తగ్గింది. ఆ దాయ లోటు కూడా గణనీయంగా తగ్గింది. మొత్తం ప్రభుత్వ రుణం జిడిపిలో 82 శాతంగా ఉన్నప్పటికీ, ప్రస్తుత వృద్ధి పరిస్థితుల్లో అది నిర్వహించ గల్గినదే అ ని అంచనా వేసింది. అ యితే, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక పరిస్థితిపై సర్వే ఆందోళన వ్యక్తం చేసిం ది. రాష్ట్రాల ద్రవ్య లోటు మళ్లీ 3 శాతం దాటింది. అధిక వ్యయాలు, సంక్షే మ పథకాల కారణంగా ఆదాయ లోటు పెరుగుతోంది. వడ్డీ చెల్లింపులు రాష్ట్రాల ఆదాయంలో దాదాపు 18శాతం వా టా ఉన్నాయని సర్వే హెచ్చరించింది.

2019–20 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే కేంద్ర ప్రభుత్వ మూలధన వ్యయం రెండింతలకుపైగా పెరిగి రూ.10లక్షల కోట్లకు చేరిం ది. జిడిపిలో ఈ వాటా 4 శాతానికి చేరడం రికారుథ స్థాయి అని సర్వే పేర్కొంది. ప్రైవేట్ పెట్టుబడులు కూడా నెమ్మదిగా పుంజుకుంటున్నా యి. తయారీ రంగంలో సామర్థ్య వినియోగం 75 శాతాన్ని దాటిం ది. స్థూల స్థిర మూలధన నిర్మాణం జిడిపిలో 34శాతానికి పెరిగింది.

చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు బ్యాంకు రుణాలు 2025 నవంబర్ నాటికి 24.6శాతం పెరిగాయి. జిఎస్‌టి నమోదు చేసిన సంస్థ లు 1.5 కోట్లకు చేరాయి. అయితే, చెల్లింపుల ఆలస్యం ఇంకా ప్రధా న సమస్యగా ఉందని సర్వే తెలిపింది. ఉపాధి, ఉత్పత్తిలో ఈ రంగం కీలకమైనందున సమస్య పరిష్కారం అవసరమని సర్వే సూచించింది. నిరుద్యోగ రేటు 3.2 శాతానికి తగ్గిందని సర్వే తెలిపింది. మహిళల కార్మిక భాగస్వామ్యం 37 శాతానికి పైగా పెరిగింది. 2025–26 రెండో త్రైమాసికంలో 56.2 కోట్ల మంది ఉపాధిలో ఉన్నారు. అయితే, ఉపాధి నాణ్యత, నైపుణ్యాల లోపం ప్రధాన సవాలుగా ఉందని సర్వే పేర్కొంది.

మొదటిసారిగా కృత్రిమ మేధస్సు(ఎఐ)పై ఆర్థిక సర్వే ప్రత్యేక అధ్యాయం కేటాయించారు. ఎఐ సేవల ఎగుమతులకు అవకాశాలు కల్పిస్తుంది. అయితే ప్రమాదాలు ఉన్నాయని హెచ్చరించింది. ప్రపంచ ఎఐ ప్రతిభలో భారత్ వాటా 16 శాతంతో ఎక్కువగా ఉన్నప్పటికీ, పెట్టుబడులు తక్కువగా ఉన్నాయి. సరైన విధంగా వినియోగిస్తే ఎఐ వృద్ధిని గణనీయంగా పెంచగలదని అంచనా వేసింది.

పిల్లలకు సోషల్ మీడియా నిషేధించాలనే దిశగా సర్వే కొన్ని విషయాలు చెప్పింది. ఆన్‌లైన్ వేదికల వినియోగంలో వయసు నిబంధనలు పరిగణించాలని, డిజిటల్ వ్యసనాన్ని నియంత్రించేందుకు ఆన్‌లైన్ టీచింగ్‌ను తగ్గించాలని ఆర్థిక సర్వే చెప్పింది. అనారోగ్యకర ఆహారం, స్థూలకాయం దేశ ఆర్థిక ప్రమాదమని ఆర్థిక సర్వేలో తెలిపింది. మహిళల్లో 24 శాతం, పురుషుల్లో 23 శాతం స్థూలకాయం ఉంది. పిల్లల్లో కూడా సమస్య పెరుగుతోంది. అల్ట్రా ప్రాసెస్డ్ ఆహార వినియోగం వేగంగా పెరుగుతోందని సర్వే హెచ్చరించింది.

గిగ్ కార్మికుల ఆదాయంపై ఆర్థిక సర్వే ఆందోళన వ్యక్తం చేసింది. ఆర్థిక సర్వే ప్రకారం, దేశంలో 40 శాతం గిగ్ కార్మికులు నెలకు రూ.15 వేలలోపు ఆదాయం పొందుతున్నారు. పనికి కనీస వేతనం నిర్ణయించాలని సర్వే సూచించింది. ఆదాయ అస్థిరత్వం, రుణాల కొరత, అల్గోరిథమ్ నియంత్రణలతో కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సర్వే హెచ్చరించింది. నైపుణ్యాభివృద్ధి, సామాజిక భద్రత అవసరమని తెలిపింది.

భారత స్వదేశీ విధానాన్ని క్రమశిక్షణతో అమలు చేయాలి. దిగుమతుల తగ్గింపుకంటే ఎగుమతి సామర్థ్యమే ప్రమాణమని తెలిపింది. తూర్పు ఆసియా, వియత్నాం అనుభవాలను ప్రస్తావిస్తూ ఖర్చుల తగ్గింపు, నియంత్రణల సరళీకరణ అవసరమని చెప్పింది. పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఈ సర్వేలో, రాజకీయ మద్దతు, పనితీరు ఆధారిత విధానాలు అవసరమని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు.

# ముగిసిన అజిత్ పవార్ అంత్యక్రియలు



**ముంబయి జనవరి, 29 (సూర్యసేన ప్రతినిధి):** విమాన ప్రమాదంలో మృతి చెందిన మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ అంత్యక్రియలు ముగిశాయి. గురువారం మధ్యాహ్నం విద్యా ప్రతిష్ఠాన్ మైదానంలో ప్రభుత్వ లాంఛనాలతో అజిత్ పవార్‌కు అంతిమ సంస్కారాలు చేశారు. ఈ అంత్యక్రియల్లో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, మహారాష్ట్ర సిఎం దేవేంద్ర కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల మంత్రులు, రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు. అజిత్ పవార్‌ను కడసారి చూసేందుకు ఎన్‌సిపి కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున మైదానం చేరుకున్నారు. జిల్లా పరిషత్ ఎన్నికల ప్రచారానికి వెళ్తుండగా బారామతి విమానాశ్రయం సమీపంలో విమానం కూలడంతో అజిత్ పవార్‌తో మరో నలుగురు మృతి చెందిన విషయం తెలిసిందే.

# కెసిఆర్‌పై గౌరవం ఉంది.. సిట్ విచారణకు సహకరించాలి: పిసిసి చీఫ్

**హైదరాబాద్ జనవరి, 29 (సూర్యసేన ప్రతినిధి):** ఫోన్ ట్యాపింగ్ అత్యంత హేయమని టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. గత పదేళ్లలో విచ్చలవిడిగా ఫోన్ ట్యాపింగ్ చేశారన్నారు. కెసిఆర్ సిట్ విచారణకు సహకరించాలని పిసిసి అధ్యక్షుడు సూచించారు. గాంధీభవన్‌లో పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ విలేకరులతో మాట్లాడుతూ.. అప్పటి ప్రభుత్వంలోని పెద్దల ప్రమేయం లేకుండా అధికారులు ట్యాపింగ్ చేయలేరని ఆయన ఆరోపించారు. ఉద్యమకారుడిగా కెసిఆర్‌పై గౌరవం ఉందన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో నిజానిజాలు తేలాలని మహేశ్‌కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. 500లకు పైగా ఫోన్ నంబర్‌లు ట్యాప్ అయ్యాయన్న సమాచారం తమ దగ్గర ఉందన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు హాజరు కావాలని నోటీసులు ఇచ్చేందుకు సిట్ అధికారులు నందినగర్‌లోని కెసిఆర్ ఇంటికి వెళ్లారని, ఆ సమయంలో కెసిఆర్ ఫాంహౌస్‌లో ఉన్నారని, దీంతో నందినగర్‌లోని కెసిఆర్ నివాసంలో నోటీసులు ఇచ్చి సిట్ అధికారులు వెళ్లిపోయారని పిసిసి అధ్యక్షుడు తెలిపారు. సిట్ సంపూర్ణ విచారణ జరిపితేనే నిజాలు బయటకు వస్తాయని, ఈ విషయంలో వాస్తవాలు బయటకు రావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. కెసిఆర్‌కు నోటీసులు ఇవ్వడంపై రాజకీయ దురుద్దేశం లేదన్నారు. మున్సిపా లిటీలో మెజారిటీ స్థానాలను గెలుస్తామన్నారు. మున్సిపాలిటీల కోసం డైవర్షన్ పాలిటిక్స్ చెయ్యాల్సిన అవసరం లేదన్నారు. ఇంచార్జ్ మంత్రులు మున్సిపల్ ఎన్నికల్లో అభ్యర్థులకు బిఫాం ఇచ్చే విషయంలో వారికి పూర్తి స్వేచ్ఛ ఉందన్నారు.



# ప్రపంచానికి భారత్ ఆశా కిరణం: మోడీ

**ఢిల్లీ జనవరి, 29 (సూర్యసేన ప్రతినిధి):** భారత పార్లమెంట్ లో రాష్ట్రపతి ద్రౌపతి ముర్మ్ ప్రసంగం ప్రజల ఆత్మవిశ్వాసాన్నిప్రతిబింబించిందని..ఇది చరిత్రలో అరుదైన గౌరవం అని ప్రధాని నరేంద్రమోడీ కొనియాడారు. పార్లమెంటు సభ్యులకు మార్గనిదేశం చేస్తూ కొన్ని విషయాలు చెప్పారని అన్నారు. బడ్జెట్ సమావేశాలు చాలా కీలకమైనవని, ఈ సందర్భంగా దేశ ప్రజలు, యువత ఆకాంక్షలు ప్రతిబింబించేలా ఢిల్లీలో ఆయన ప్రసంగించారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 9వ సారి బడ్జెట్ ప్రవేశ పెట్టబోతున్నారని, 2047 వికసిత్ భారత్ లక్ష్యంతో బడ్జెట్ ప్రవేశ పెట్టబోతున్నామని తెలియజేశారు. రిఫార్మ్, పెర్ఫామ్, ట్రాన్స్ ఫార్మ్ విధానంతో ముందుకెళ్లాలని, భారత్–ఇయూ వాణిజ్య ఒప్పందం భారత భవిష్యత్ కు కీలకం కానుందని మోడీ జోష్యం చెప్పారు. ప్రపంచానికి భారత్ ఆశా కిరణంగా మారిందని, భారత్–ఇయూ ఒప్పందం మదర్ ఆఫ్ ఆల్ డీల్స్ గా మారిందని అన్నారు. మన వస్తువులకు డిమాండ్ పెరగబోతుందని, తయారీ, సర్వీస్ సెక్టార్ లో మన భాగస్వామ్యం పెరుగుతుందని నరేంద్ర మోడీ పేర్కొన్నారు.



# లిఫ్ట్ ఇచ్చి... కదులుతున్న కారులో గ్యాంగ్ రేప్

**రాంఛీ జనవరి, 29 (సూర్యసేన ప్రతినిధి):** 25 ఏళ్ల మహిళకు కారులో లిఫ్ట్ ఇచ్చి వాహనంలో ఆమెపై ఒకరు అత్యాచారం చేశారు. ఈ సంఘటన ఉత్తరాఖండ్ రాష్ట్రం ఉద్దమ్ సింగ్ నగర్ జిల్లా రుద్రపూర్‌లోని క్యాంప్ ఏరియాలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జనవరి 25న ఓ మహిళ తన ఇంటి నుంచి పని చేసే పంత్ నగర్‌కు నడుచుకుంటూ వెళ్తోంది. రాహుల్ దాస్, పర్కాన్ అనే యువకులు మహిళకు కారులో లిఫ్ట్ ఇచ్చారు. కొంచెం దూరం తీసుకెళ్లిన తరువాత కారులోనే ఆమెపై ఇద్దరు సామూహిక అత్యాచారం చేశారు. అనంతరం ఆమెను నిర్మానుష్య ప్రదేశంలో వదిలిపెట్టి వెళ్లిపోయారు. తన కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే వారు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేయడంతో పాటు కారును స్వాధీనం చేసుకున్నారు. మరో వ్యక్తి పరారీలో ఉండడంతో అతడిని కూడా అరెస్ట్ చేశారు.





# ఇది విచారణ కాదు.. ప్రతీకారం: కెటిఆర్

**హైదరాబాద్, జనవరి, 29 (సూర్యసేన ప్రతినిధి):** బిఆర్ఎస్ అధినేత కెసిఆర్‌కు ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ నోటీసులు ఇవ్వడంపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఎక్స్ వేదికగా మండిపడ్డారు. కక్ష సాధింపు రాజకీయాలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఇది విచారణ కాదు..ప్రతీకారం.. ఇది న్యాయం కాదు..రాజకీయ దురుద్దేశం అని విమర్శించారు. చావు నోట్లో తలబెట్టి కెసిఆర్ సచ్చుడో– తెలంగాణ వచ్చుడో అనే మొక్కవోని సంకల్పంతో సుదీర్ఘ ఉద్యమం చేసి తెలంగాణను సాధించిన మహానాయకుడు కెసిఆర్ అని కొనియాడారు. సాధించిన తెలంగాణను పదేళ్ల తన పాలనతో ప్రపంచానికి చాటి చెప్పిన నాయకుడు కెసిఆర్ అని పేర్కొన్నారు.

సబ్బండ వర్గాలను కడుపులో పెట్టుకుని, రాష్ట్రాన్ని చంటి బిడ్డలా చూసుకుంటూ సాగునీటి విప్లవం, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, రైతుబంధు, రైతు బీమా, దళితబంధు వంటి పథకాలతో తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపిన గొప్ప విజనరీ కెసిఆర్ అని వ్యాఖ్యానించారు. అలాంటి నాయకుడికి అడ్డగోలు హామీలు ఇచ్చి, అబద్ధాల పునాదుల మీద అధికారంలోకి వచ్చిన అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వం..అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ప్రజల నోట్లో మట్టి కొట్టి, ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైందని విమర్శించారు.



తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు, పాలనా లోపాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు, ఇప్పుడు విచారణల పేరుతో కెసిఆర్‌పై నోటీసులు ఇవ్వడం అత్యంత దుర్మార్గమైన కక్షసాధింపు రాజకీయానికి నిదర్శనం అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కెసిఆర్ తెలంగాణ ప్రజల గుండెల్లో నిలిచిన నాయకుడు అని, నోటీసులతో, బెదిరింపులతో తెలంగాణ చరిత్రను చెరిపేయలేరని వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమాన్ని, తెలంగాణ ఆత్మగౌరవాన్ని అవమానిస్తే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. బిఆర్ఎస్ పార్టీ ఈ కక్షసాధింపు రాజకీయాలను తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ప్రజల పక్షాన నిలబడి, ప్రజల గొంతుకగా ఈ అన్యాయ పాలనపై పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. తెలంగాణ చరిత్రను విచారణలతో కాదు...ప్రజల తీర్పుతోనే రాస్తారని అన్నారు.

# కెసిఆర్‌ను టచ్ చేస్తే తెలంగాణ ఆత్మగౌరవాన్ని టచ్ చేసినట్టే: హరీష్ రావు

**హైదరాబాద్, జనవరి, 29 (సూర్యసేన ప్రతినిధి):** బిఆర్ఎస్ అధినేత కెసిఆర్‌ను టచ్ చేయడం అంటే తెలంగాణ ఆత్మగౌరవాన్ని టచ్ చేయడమేనని మాజీ మంత్రి, బిఆర్ఎస్ సీనియర్ నేత హరీష్ రావు పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కెసిఆర్‌కు సిట్ నోటీసులు జారీ చేయడంపై హరీష్‌రావు ఎక్స్ వేదికగా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది పూర్తిగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం సాగిస్తున్న రాజకీయ కక్ష సాధింపు చర్యే అని, ఈ కుతంత్రాలను తీవ్రంగా ఖండిస్తున్నామని స్పష్టం చేశారు. కెసిఆర్ తెలంగాణ జాతి పిత అని, కోట్లాది మంది ప్రజల ఆరాధ్య దైవమని, అలాంటి నాయకుడిపై బురద చల్లాలని చూడటం సూర్యుడిపై ఉమ్మి వేయడమేనని వ్యాఖ్యానించారు. పాలనలో తమ చేతకానితనాన్ని కప్పిపుచ్చుకోవడానికే కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. రాష్ట్రంలో పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని, ముఖ్యంగా సింగరేణి బొగ్గు కుంభకోణం మరకల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే సిట్ పేరుతో నోటీసుల డ్రామా ఆడుతున్నారని విమర్శించారు. ఇది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న చిల్లర, చౌకబారు రాజకీయాలకు పరాకాష్ఠ అని దుయ్యబట్టారు. ఇలాంటి రాజకీయ వేధింపులతో రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూడటం రేవంత్ రెడ్డి రాజకీయ దివాలాకోరుతనానికి నిదర్శనమని అన్నారు.



తెలంగాణ స్వరాష్ట్ర స్వప్నాన్ని సాకారం చేసి, దశాబ్ద కాలంలో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపిన మహానేత కెసిఆర్ అని కొనియాడారు. కెసిఆర్ చరిత్రను సృష్టిస్తే, ఆ చరిత్రను మలినం చేసేందుకు రేవంత్ రెడ్డి చరిత్రహీనుడిగా ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. అధికారం శాశ్వతం కాదని, అహంకారం అంతకంటే కాదని గుర్తుంచుకోవాలన్నారు. తెలంగాణ సమాజం మొత్తం కెసిఆర్ వెంటే ఉందని, ప్రభుత్వ రాజకీయ వేధింపులకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హరీష్ రావు హెచ్చరించారు.

# ఎన్నికల నేపథ్యంలోనే కెసిఆర్‌కు నోటీసులు: కవిత

**హైదరాబాద్, జనవరి, 29 (సూర్యసేన ప్రతినిధి):** మున్సిపల్ ఎన్నికలు జరుగుతున్నాయనే కెసిఆర్‌కు సిట్ నోటీసులు ఇచ్చిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ బాధాకరమని అన్నారు. సిట్ విచారణ సీరియస్‌గా జరగట్లేదని ఆక్షేపించారు. ఈ కేసులో విచారణ ఎక్కడో ఒక దగ్గర పూర్తికావాలని పేర్కొన్నారు. విచారణను పూర్తి చేసే ఉద్దేశం ఉందా.. లేదా అనేది ఎవరికీ అర్థం కావడంలేదన్నారు. ఫోన్ ట్యాపింగ్ నేరస్థులకు శిక్షపడాల్సిందేనని ఆమె స్పష్టం చేశారు.

**భగ్గుమన్న బిఆర్ఎస్ నేతలు**

బిఆర్ఎస్ అధినేత కెసిఆర్‌కు ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ నోటీసులు ఇవ్వడంపై ఆ పార్టీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బొగ్గు స్కాంపై సమాధానం చెప్పే దమ్ములేకనే కెసిఆర్‌కు సిట్ నోటీసులతో డ్రామాడాడుతున్నారపని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి ఆరోపించారు. కెసిఆర్‌ను సిట్ నోటీసులు, కమిషన్లు ఏమీ చేయలేవని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి మండిపడ్డారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు శిక్ష తప్పదని హెచ్చరించారు. మాజీ ఎంపి బోయినపల్లి వినోద్‌కుమార్, ఎంపి వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, బిఆర్ఎస్ ఎంఎల్‌సి దాసోజు శ్రవణ్, పార్టీ నేతలు కర్నె ప్రభాకర్,క్రిశాంక్, ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు కెసిఆర్‌కు సిట్ నోటీసులు ఇవ్వడంపై మండిపడ్డారు.

**పలు చోట్ల సిఎం దిష్టిబొమ్మల దహనం**



ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ సిఎం కెసిఆర్‌కు సిట్ నోటీసులు ఇవ్వడాన్ని ఖండిస్తూ బిఆర్ఎస్ పార్టీ నేతలు తెలంగాణ భవన్ సమీపంలో సిఎం రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మ దహనం చేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వాడెవ్వడు వీడెవ్వడు కెసిఆర్‌కు అడ్డెవ్వరు..రేవంత్‌రెడ్డి డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. అలాగే ఉస్మానియా యూనివర్సిటీలో బిఆర్ఎస్‌వి నాయకులు ఆందోళనకు దిగారు. ఆర్ట్ కాలేజీ ముందు సిఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు.

# యాక్టింగే.. యాక్షన్ లేదు

1వ పేజీ తరువాయి

గత బీఆర్ఎస్ పాలనలో గొర్రెల పంపిణీ స్కాం జరిగిందని ఆరోపణలు వచ్చాయని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్ల గడిచినా, ఆ స్కాంపై ఇప్పటివరకు ఎలాంటి సమగ్ర విచారణ జరగడం లేదని అన్నారు. నైని కోల్ బ్లాక్ విషయంలో కూడా బీఆర్ఎస్ ప్రభుత్వంలో కొనసాగిన అదే కాంట్రాక్టును కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తోందని చెప్పారు. కేవలం కాంట్రాక్టర్లు, మంత్రివర్గం మారాయి తప్ప కమిషన్ల విధానం మాత్రం అలాగే కొనసాగుతోందని పేర్కొన్నారు. లిక్కర్ పాలసీ విషయంలోనూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలసీలనే కొనసాగిస్తున్నామని కాంగ్రెస్ ప్రభుత్వం స్వయంగా అంగీకరిస్తోందని తెలిపారు.

ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన స్కాంలపై వంద రోజుల్లోనే విచారణ పూర్తి చేసి, కేసీఆర్‌ను జైలుకు పంపిస్తామని, అక్కడే డబుల్ బెడ్రూమ్ ఇల్లు కట్టిస్తామనే మాటలు చెప్పారని, ఇప్పుడు కేవలం సిట్ విచారణ పేరుతో కాలయాపన చేస్తూ, ప్రధాన నిందితులను కాపాడుతున్నారు తప్ప ఏ చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి కేసులో రాష్ట్ర ప్రభుత్వం నామమాత్రంగా కొన్ని బ్యారేజీల వరకే సీబీఐ విచారణకు అప్పగించిందని, అయితే మొత్తం ప్రాజెక్టులో జరిగిన అక్రమాలు, అవినీతిపై సమగ్ర విచారణ జరగాల్సిందేనని రాంచంద్రరావు డిమాండ్ చేశారు.

**తెలంగాణలో బిజెపి క్రమేణా బలపడుతోంది**

బిజెపికి పెరుగుతున్న ప్రజాదరణను అడ్డుకోవడానికే కాంగ్రెస్ – బీఆర్ఎస్ పార్టీలు ఇలాంటి నాటకాలు చేస్తున్నాయని బిజెపి అధ్యక్షుడు రాంచంద్రరావు విమర్శించారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో గతంలో 163 సర్పంచ్ స్థానాలు మాత్రమే గెలిచిన బిజెపి, ఇటీవలి ఎన్నికల్లో సుమారు వెయ్యి సర్పంచ్‌లు, పదివేల వార్డు మెంబర్లు, 1200 ఉపసర్పంచ్ స్థానాలను గెలుచుకుందని గుర్తు చేశారు. ఇది తెలంగాణలో బిజెపి క్రమేణా బలపడుతోందని స్పష్టంగా సూచిస్తోందని తెలిపారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ – బీఆర్ఎస్ పార్టీలకు బుద్ధి చెప్పి, బిజెపిని గెలిపించాలని ఆయప ప్రజలను కోరారు.

సూర్య సేన

శుక్రవారం, జనవరి 30, 2026

# బ్రాహ్మణ సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం సహకరించాలి...



**– తెలంగాణ బ్రాహ్మణ సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు పోచంపల్లి రమణారావు**

**రంగారెడ్డి, జనవరి 29 (సూర్య సేన) :** తెలంగాణ రాష్ట్రంలో సకల జనుల సర్వేలో 16 లక్షల బ్రాహ్మణ కుటుంబాలు ఉన్నట్లు లెక్కలు తేలి నవీకనుక బ్రాహ్మణుల సంక్షేమానికి ప్రభుత్వం ఒక అడుగు ముందుకు వేసి, వారి అభివృద్ధికి కృషి చేస్తే రానున్న మున్సిపల్ ఎన్నికల్లో బ్రాహ్మణ జాతి అంతా కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని తెలంగాణ బ్రాహ్మణ సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు పోచంపల్లి రమణారావు అన్నారు. గురువారం పత్రికలకు

ఒక ప్రకటన విడుదల చేస్తూ, బ్రాహ్మణ జాతి అభివృద్ధి చెందేలా రాష్ట్రంలోనిబ్రాహ్మణులంతా ఏకం కావలసిన సమయం ఆసన్నమైందని అన్నారు., ఉభయ తెలుగు రాష్ట్రాలుగా రెండురాష్ట్రాలు విడిపోయిన అనంతరం బ్రాహ్మణ సంఖ్యాబలం గణనీయంగా పెరిగిందని ఈ 16 లక్షల బ్రాహ్మణ జాతి ఐక్యం కావలసిన అవసరం ఉందని, ప్రధాని నరేంద్ర మోడీ బిసి అయి ఉండి కూడాఅగ్రవర్ణాలలోని పేదలైనరెడ్డి, వెలమ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ,మార్వాడి, కులాల కొరకు కేంద్ర ప్రభుత్వం కదిలి వచ్చి ఈ డబ్ల్యూఎస్ రిజర్వేషన్ అమలు చేసిందని అదేవిధంగా రాష్ట్రంలో 16 లక్షల మంది బ్రాహ్మణులు, ఒకేసారి పిలుపు ఇస్తే అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పది లక్షల మంది పేద బ్రాహ్మణులు ఉన్నారని వంట బ్రాహ్మణులుగా,పురోహితులుగా, అర్చకులుగా, పనిచేస్తున్నారని అన్ని వర్గాలతో మమేకమై జీవనం సాగిస్తున్న బ్రాహ్మణులపై కొన్ని వర్గాలు చిన్నచూపు చూస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు, సమాజ హితం కొరకు సమాజ శ్రేయస్సు కొరకు ఉన్నటువంటి బ్రాహ్మణ జాతిని అణగారిన వర్గంగా గుర్తించాల్సిన పరిస్థితి ఏర్పడిందని అందుకు తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి బ్రాహ్మణ మేధావులు చర్చ జరపాలని ప్రభుత్వం దృష్టికి ఈ విషయం తీసుకువెళ్లాలని అన్నారు. గత ప్రభుత్వం నుండి ఈ ప్రభుత్వం వరకు బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని పోరాటాన్ని, కొనసాగిస్తూ ఉన్నామని ప్రస్తుత తెలంగాణబ్రాహ్మణసంఘ సమాఖ్య కృషి చేస్తుందని బ్రాహ్మణ మేధస్సును అన్ని పార్టీలు వాడుకొని వదిలి వేస్తున్నాయి, ఇది చాలా బాధాకరమని అన్నారు, బ్రాహ్మణులు రాజకీయంగా ఆర్థికంగాసామాజికపరంగా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని సర్వేజనా సుఖినోభవంతు అంటూ దీవించేబ్రాహ్మణులకు నామినేటెడ్పోస్టులలో,కార్పొరేషన్ చైర్మన్, లలో స్థానిక మునిసిపల్ పోరులో అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

# ప్రజా ప్రభుత్వం హయాంలోనే పోచమ్మ కుంట సుందరీకరణ



**– కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నవారు మల్లారెడ్డి**

**రంగారెడ్డి, జనవరి 29 (సూర్య సేన) :** కాంగ్రెస్ ప్రభుత్వంలోనే అల్మాస్గూడ పోచమ్మ కుంట అభివృద్ధి సుందరకరణ పనులు పునః ప్రారంభమై చురుకుగా సాగుతున్నాయని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నవారు మల్లారెడ్డి స్పష్టం చేశారు. జిహెచ్ఎంసి బడంగ్ పేట సర్కిల్లోని నాదర్గుల్ డివిజన్ 57 కిందికి వచ్చే అల్మాస్గూడ పోచమ్మ కుంట అభివృద్ధి సుందరీకరణలో భాగంగా జరుగుతున్న ఫెన్సింగ్ లైటింగ్ పనులను మల్లారెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ నాయకుల బృందం పరిశీలించింది. ఈ మేరకు వారు పనులు చేస్తున్న కాంట్రాక్టర్ తో కలిసి పాదయాత్ర చేస్తూ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా నవారు మల్లారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో ప్రారంభమైన చెరువు సుందరకరణ అభివృద్ధి పనులలో అవినీతి అక్రమాలు జరగాయని ఎన్నికల తరువాత పనులు ఆగిపోయాయని తెలిపారు. ఈ నేపథ్యంలో పార్టీ తరఫున మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకువెళ్లి చర్ల సుందరీకరణ పనులలో జరిగిన అవినీతి అక్రమాలను వివరించామని ఆయన వెల్లడించారు. దీనితో మాజీ శాసనసభ్యులు చెరువును పరిశీలించిన తదుపరి జిల్లా ఇన్చార్జి మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి తీసుకు వెళ్ళగా మంత్రి హెచ్ఎండిఏ కమిషనర్కు ఆదేశాలు ఇవ్వడంతో పనులు ప్రారంభం అయ్యాయని మల్లారెడ్డి వివరించారు. ప్రస్తుతం చెరువు అభివృద్ధి పనులు జరుగుతుండడం పట్ల పరిసర ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని ఆయన తెలిపారు. ఈ మేరకు పూర్తిస్థాయిలో పనులు జరుగుతున్నందుకు ఆయన మంత్రి శ్రీధర్ బాబుకు ఇన్చార్జి కిచ్చన్న గారిలక్ష్మారెడ్డికి, డిసి సరస్వతికి కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మల్ గారి శ్రీధర్ రెడ్డి, రామిడి శ్రీనివాసరెడ్డి, దిండు శ్రీనివాస్ గౌడ్, నవారు ప్రభాకర్ రెడ్డి, న్యూ మధురాపురి కాలనీ అధ్యక్షులు నవీన్ రెడ్డి, కృష్ణారెడ్డి, వై జైపాల్, వంశీ, చంద్రన్, ఏనుగు వంశీ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి పెరటిలో 14 అడుగుల జొన్న మొక్క



**కోదాడ ప్రతినిధి, జనవరి 29 (సూర్యసేన) :** సాధారణంగా మన వాతావరణ పరిస్థితుల్లో జొన్న మొక్కలు 5 నుంచి 10 అడుగుల ఎత్తు వరకు మాత్రమే పెరుగుతాయి. స్థానిక హైబ్రిడ్ రకాలు 6 నుంచి 8 అడుగులు, మెరుగుపరిచిన హైబ్రిడ్ రకాలు గరిష్టంగా 10 అడుగుల ఎత్తు వరకు పెరుగుతాయి. 90 నుంచి 130 రోజుల్లో పంటకొచ్చే జొన్న రకాలు తమ జీవితకాలంలో ఈ ఎత్తుకే పరిమితమవుతాయి. అయితే కోదాడ పట్టణంలోని ప్రాంతీయ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డా. పి. పెంటయ్య ఇంటి పెరటిలో పెరిగిన జొన్న మొక్క రెండు నెలల వయస్సులోనే 14 అడుగుల ఎత్తుకు చేరి చూపరులను ఆశ్చర్యపరుస్తోంది. అభివృద్ధి పరచిన గడ్డి జొన్న కూడా సాధారణంగా తన జీవితకాలంలో ఇంత ఎత్తు పెరగడం అరుదే. ఈ సందర్భంగా డా. పెంటయ్య మాట్లాడుతూ, ఇంటి ముందు పెరటిలో పూలు, పసుపు మొక్కలకు అప్పుడప్పుడు ఖనిజ లవణ మిశ్రమ ఎరువు వేయడం, ఇంట్లో ఉల్లిపాయలు, కూరగాయలు తరిగిన తరువాత మిగిలిన వ్యర్థాలను పెరటిలో వేయడం వలన భూసారం పెరిగి మొక్క అసాధారణంగా ఎదిగిందని తెలిపారు. ప్రస్తుతం జొన్న మొక్కకు ఇంకా కంకి వేయలేదని, మరో రెండు అడుగుల వరకు పెరిగే అవకాశం ఉందన్నారు. కృత్రిమ ఎరువులతో ఎంత పెంచినా ప్రకృతిసిద్ధంగా పెరిగే మొక్కల ఆరోగ్యం, పటుత్వం, పరిమాణం వేరు అని ఈ మొక్కను చూస్తే అర్థమవుతుందని స్థానికులు అంటున్నారు.

# కస్వాను పరామర్శించిన గుండం మోహన్ రెడ్డి

**రంగారెడ్డి, జనవరి 29 (సూర్య సేన) :** ఇటీవలనే గుండె బైపాస్ సర్జరీ చేసుకుని పటాన్ చెరువు ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న నియోజకవర్గ ప్రజలలో సుపరిచితుడు కస్వా శంకర్రావు ను బుధవారం పరామర్శించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు గుండం మోహన్ రెడ్డి మరియు వంగల శ్రీకాంత్, భానురుకు చెందిన మొగిలి గారి రాజశేఖర్ రెడ్డి తదితరులు. ఈ సందర్భంగా గుండం మోహన్ రెడ్డి మాట్లాడుతూ రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను తన పదునైన వార్తలతో ఎన్నో అంశాలను అటు ప్రభుత్వ పెద్దలకు, ఇటు అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి తమ సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. ప్రాంత వాసులలో సీనియర్ జర్నలిస్టుగా ఉన్న కస్వా శంకర్రావు ప్రాంత సమస్యలను వార్తల రూపంలో వ్రాసి ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకు పోయారని అన్నారు. ఓకే బావ జాలం తో ఉన్న మేము గతంలో ప్రజా సమస్యలపై స్పందించిన విషయాలను నెమరు వేశారు. విద్యార్థి దశలోనే ఉస్మానియా యూనివర్సిటీలో ఎన్నో విద్యార్థి ఉద్యమాలకు నాయకత్వం వహించిన వ్యక్తి కస్వాశంకర్రావు అని అన్నారు. స్థానిక సమస్యలపై సంపూర్తి పటుత్వం ఉన్న కస్వా అనుకోకుండా ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవడం బాధాకర విషయం అని అన్నారు. తమ ఇద్దరి సహచర మిత్రుడు మేధావుల ఫోరం సభ్యులు హైకోర్టు న్యాయవాది డాక్టర్ కిషన్ మామిళ్ళ సైతం ఇక్కడ స్థిరనివాసం ఏర్పాటు చేసుకుని ఉండడం సంతోషించదగ్గ విషయమని అన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో కిషన్ మామిళ్ళ పోషించిన పాత్ర అమోఘం అని అన్నారు. మేము ముగ్గురం సహచరులం ఇక్కడే కుటుంబాలతో ఉండడం సంతోషకర విషయం అని అన్నారు. తెలంగాణ రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ప్రచురించిన నూతన సంవత్సర క్యాలెండర్ ను కస్వాకు గుండం మోహన్ రెడ్డి బహుకరించారు. వంగల శ్రీకాంత్ మాట్లాడుతూ దాదాపు 10 సంవత్సరాలు కస్వా శంకర్



రావు గారి ఇంట్లో కిరాయికి ఉన్నామని అప్పటినుండి కస్వా కుటుంబంతో తమ కుటుంబానికి మంచి సత్సంబంధాలు ఉన్నాయని అన్నారు. సమస్యపై వెంటనే స్పందించే కస్వా శంకర్రావు గుండె బైపాస్ ఆపరేషన్ అయినట్లు తెలవడంతో కుటుంబ సమేతంగా కస్వా ఇంటికి చేరుకొని ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నామని అన్నారు. పెద్దాయన కస్వా ధైర్యంగా ఉండాలని కోరారు. భానురు కు చెందిన మొగిలి గారి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ స్థానికంగా ఎంతో కాలం వాటర్ వర్క్స్ లో సేవలందించానని ప్రాంత ప్రజలలో సుపరిచితుడునని అన్నారు. మిత్రుడు కస్వాకు ఓపెన్ హార్ట్ సర్జరీ కావడం తెలియడంతో పరామర్శించడానికి ఇంటికి చేరుకున్నామని అన్నారు. కస్వా అతి త్వరలో ఆరోగ్యవంతుడిగా కోలుకొని, తిరిగి మళ్ళీ పదునైన తాజా వార్తలతో ప్రజల సమస్యలను వెలుగులోకి తేవాలని కోరుతున్నామని అన్నారు.

# జంతు యజమానుల సౌకర్యార్థం సిమెంట్ బెంచీ విరాళం




**కోదాడ ప్రతినిధి, జనవరి 29 (సూర్యసేన) :** కోదాడ పట్టణంలోని ప్రాంతీయ పశువైద్యశాలకు ప్రతిరోజూ అధిక సంఖ్యలో జంతు యజమానులు తమ పశువుల వైద్యం కోసం వస్తున్నారు. అధిక రద్దీ కారణంగా యజమానులు తమ వంతు వచ్చేవరకు ఆవరణలో నిల్చొని ఎదురుచూడాల్సి వస్తుండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మహబూబ్ జానీ అందించిన ఒక్క సిమెంట్ బెంచీ మాత్రమే ఉండడంతో ముగ్గురు మాత్రమే కూర్చునే వీలుండగా, మిగతా వారు నిల్చోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితిని గమనించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లా జగ్గయ్యపేటకు చెందిన ఉపాధ్యాయుడు కోటా దానియేలు, తన పెంపుడు కుక్కకు శస్త్రచికిత్స నిమిత్తం ఆసుపత్రికి వచ్చిన సందర్భంగా యజమానులకు కూర్చునే వసతి లేకపోవడాన్ని గుర్తించి సిమెంట్ బెంచీ తయారు చేయించి విరాళంగా అందించారు. ఈ సందర్భంగా దానియేలు మాట్లాడుతూ, అధిక సంఖ్యలో యజమానులు రావడంతో ఆవరణంతా నిండిపోవడంతో అసిస్టెంట్ డైరెక్టర్‌పై పని ఒత్తిడి పెరుగుతోందని గమనించానన్నారు.

యజమానులకు కూర్చునే సౌకర్యం ఉంటే వారు ప్రశాంతంగా తమ వంతు కోసం వేచి ఉండి వైద్యం చేయించుకుంటారని, తద్వారా సిబ్బందిపై ఒత్తిడి తగ్గుతుందని భావించి బెంచీని అందజేశానన్నారు. అసిస్టెంట్ డైరెక్టర్ మాట్లాడుతూ, సిమెంట్ బెంచీ విరాళంగా అందించిన కోటా దానియేలు సహృదయాన్ని అభినందించారు. పశువైద్యశాలలో కూర్చునే సౌకర్యం లేక యజమానులు మెట్లపై, రాళ్లపై కూర్చోవాల్సి రావడం ఇబ్బందికరమైందన్నారు. దాతల సహకారంతో త్వరలో ఆవరణలో మరిన్ని బెంచీలు ఏర్పాటు చేసి యజమానుల అసౌకర్యాన్ని తొలగిస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో దాత దానియేలు, కాపుగల్లు పశువైద్యాధికారి డా. సిరిపురపు సురేంద్ర, సిబ్బంది రాజు, చంద్రకళ, కర్ణ పాల్గొన్నారు.

# చిరుధాన్యాల విలువ ఆధారిత ఉత్పత్తులపై మహిళలకు శిక్షణ గడ్డిపల్లి కేవీకేలో రెండు రోజుల కార్యక్రమం




**గరిడేపల్లి ప్రతినిధి, జనవరి 29 (సూర్య సేన) :** సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే), గడ్డిపల్లిలో చిరుధాన్యాలు వాటి విలువ ఆధారిత ఉత్పత్తులపై యువతులకు, మహిళలకు రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని గృహ విజ్ఞాన శాస్త్రవేత్త యన్. సుగంధి ప్రారంభించారు. ఈ శిక్షణ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేవీకే ఇన్‌చార్జ్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డి. నరేష్ మాట్లాడుతూ చిరుధాన్యాల వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. చిరుధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తులు తయారు చేసి రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. అంతేకాకుండా ఈ ఉత్పత్తులను మార్కెటింగ్ చేయడం ద్వారా యువత, మహిళలు స్వయం ఉపాధి అవకాశాలు పొందవచ్చని సూచించారు. అనంతరం గృహ విజ్ఞాన శాస్త్రవేత్త యన్. సుగంధి మాట్లాడుతూ రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రలు వంటి చిరుధాన్యాల పోషక విలువలను వివరించారు. వీటితో బిస్కెట్లు, కేకులు, లడ్డులు, మురుకులు వంటి వివిధ విలువ ఆధారిత ఉత్పత్తులు తయారు చేసే విధానాలను ప్రాయోగికంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పి. అక్షిత్, హుజూర్‌నగర్ మహిళా మండలి అధ్యక్షురాలు అరుణ, లలిత టైలరింగ్, కంప్యూటర్ టీచర్లు, అలాగే హుజూర్‌నగర్, సూర్యాపేట ప్రాంతాలకు చెందిన 35 మంది మహిళలు, యువతులు పాల్గొన్నారు.

# క్యాట్ లెవెల్––2 పరీక్షలో శ్రీ చైతన్య విద్యార్థుల ఘన విజయం

**హుజూర్నగర్ ప్రతినిధి, జనవరి 29 (సూర్య సేన) :** హుజూర్నగర్ శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు క్యాట్ లెవెల్––2 పోటీ పరీక్షల్లో విశేష ప్రతిభ కనబర్చి ఘన విజయం సాధించారని పాఠశాల ప్రిన్సిపల్ పోసాని వెంకటరమణారావు తెలిపారు. ఈ పరీక్షల్లో మొత్తం 46 మంది విద్యార్థులు ఉత్తీర్ణులై పాఠశాలకు మంచి పేరు తీసుకువచ్చారని పేర్కొన్నారు.

మ్యాట్ (మ్యాథ్స్ ఆప్టిట్యూడ్ టెస్ట్) విభాగంలో శ్రీవల్లి, చరిత, జగదీష్, గీర్వాణి అనే నలుగురు విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రూ.1000 నగదు బహుమతి, గోల్డ్ మెడల్, మెరిట్ సర్టిఫికెట్ పొందారని తెలిపారు. అదేవిధంగా చాట్ (కెమిస్ట్రీ ఆప్టిట్యూడ్ టెస్ట్) విభాగంలో నామ జోష్, శ్రీనిధి, సౌమ్యశ్రీ, ధీరజ్ సాయి, శాన్విక, చేతన్ శ్రీవత్సవ అనే ఆరుగురు విద్యార్థులు రూ.1000 నగదు బహుమతి, గోల్డ్ మెడల్, మెరిట్ సర్టిఫికెట్ సాధించారని వెల్లడించారు. మరో 36 మంది విద్యార్థులు మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్లు పొందారని చెప్పారు. ఈ సందర్భంగా పోటీ పరీక్షల్లో విజయం సాధించిన విద్యార్థులను డీన్ ప్రేమ్ సాగర్, ఉపాధ్యాయులు



ప్రియాంక, శ్రీనివాసరెడ్డి, రామకృష్ణారెడ్డి, గురవయ్య, హనుమ, మాలకొండయ్య, బత్తిని శ్రీనివాస్, గోవర్ధన్ గురువారం అభినందించారు. కఠినమైన పోటీ పరీక్షల్లో విజయం సాధించడానికి విద్యార్థుల కృషితో పాటు ఉపాధ్యాయుల సమిష్టి ప్రయత్నమే కారణమని ప్రిన్సిపల్ పోసాని వెంకటరమణారావు పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయిలో ప్రతిభ చాటేలా విద్యార్థులు ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

# మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా జరగాలి...

**– నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి: సీఐ చరమంద రాజు**

**హుజూర్నగర్ ప్రతినిధి, జనవరి 29 (సూర్య సేన) :** హుజూర్నగర్ నియోజకవర్గ పరిధిలోని హుజూర్నగర్, నేరేడుచర్ల మున్సిపాలిటీలకు జరుగుతున్న ఎన్నికల సందర్భంగా నామినేషన్ ప్రక్రియను ప్రశాంతంగా, శాంతియుతంగా నిర్వహించేందుకు అభ్యర్థులు, రాజకీయ పార్టీల నాయకులు పోలీస్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని హుజూర్నగర్ సీఐ చరమంద రాజు గురువారం విజ్ఞప్తి చేశారు. నామినేషన్ కేంద్రానికి అభ్యర్థి మాత్రమే రావాలని, అతనితో పాటు మరో ఇద్దరికి మాత్రమే లోపలికి అనుమతి ఉంటుందని తెలిపారు. నామినేషన్ కేంద్రానికి 100 మీటర్ల దూరంలో వాహనాలు నిలిపి, లోపలికి రావాల్సి ఉంటుందని సూచించారు. నామినేషన్ పత్రాల్లో లోపాలు ఉంటే, కేంద్రంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్ ద్వారా సరిచూసుకునే అవకాశం ఉందని తెలిపారు.

నామినేషన్‌కు వచ్చే అభ్యర్థులు పార్టీ గుర్తులు, జెండాలు, కండువాలు ధరించి లోపలికి రాకూడదని స్పష్టం చేశారు. సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో అభ్యర్థులు గుంపులు గుంపులుగా నామినేషన్ కేంద్రాల వద్దకు రావడం నిషిద్ధమని హెచ్చరించారు. జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున గుమికూడటం నిషేధమని, అనుమతి లేకుండా ఎలాంటి ర్యాలీలు నిర్వహించరాదన్నారు. బైక్ లేదా కార్ ర్యాలీలు నిర్వహించాలనుకుంటే ముందుగా రిటర్నింగ్ అధికారిని అనుమతి తీసుకోవాలని సూచించారు. నామినేషన్ కేంద్రాల వద్ద




144 సెక్షన్ అమలులో ఉన్నందున కేంద్రం పరిసరాల్లో గుమికూడకూడదన్నారు. నామినేషన్ కేంద్రంలోకి సెల్‌ఫోన్లకు అనుమతి లేదని, ఊరేగింపులు, ర్యాలీలకు డీజే సౌండ్ సిస్టంలు వాడకూడదని తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరగాలనే ఉద్దేశంతో అనుమానితులు, రౌడీలు, కేడీలు, డీసీలు, ట్రబుల్ మేకర్లను ముందస్తుగా బైండోవర్ చేయనున్నట్లు చెప్పారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఒకరిపై మరొకరు వాట్సాప్, సోషల్ మీడియా ద్వారా అసత్య ఆరోపణలు చేయడం, వాటిని షేర్ చేయడం లేదా ప్రోత్సహించడం చేస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ చరమంద రాజు హెచ్చరించారు.

# జర్నలిస్టు కుటుంబానికి టీడబ్ల్యూజేఎఫ్ మద్దతు



**– రోడ్డు ప్రమాదంలో గాయపడిన టిబిజేఏ అధ్యక్షుడు సామ్రాట్ గుప్తా కుమారుడు**

**– పరామర్శించిన రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య**

**హైదరాబాద్, జనవరి 29 (సూర్య సేన) :** రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్ నాగోల్ రాక్‌టౌన్ కాలనీలోని పవన్ సాయి ఆర్థోపెడిక్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్, టీబీజేఏ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు సామ్రాట్ గుప్తా కుమారుడు హర్షిత్ తేజను ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య గురువారం పరామర్శించారు.

సిద్ధిపేట జిల్లాలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న హర్షిత్ తేజ తన మామయ్యతో కలిసి కారులో ప్రయాణిస్తుండగా లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ తీవ్ర ప్రమాదంలో అతనికి కుడికాలు, కుడిచేయి విరిగాయి. ప్రస్తుతం పవన్ సాయి ఆర్థోపెడిక్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ, నేడు శస్త్రచికిత్స నిర్వహించనున్నట్లు వైద్యుడు డాక్టర్ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా మామిడి సోమయ్య హర్షిత్ తేజ ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని, సామ్రాట్ గుప్తా కుటుంబానికి ధైర్యం చెప్పారు. అలాగే వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5,000 ఆర్థిక సహాయం అందజేసి, టీడబ్ల్యూజేఎఫ్ జర్నలిస్టు కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## సంపాదకీయం

శుక్రవారం, జనవరి 30, 2026

# మాతృశక్తి...

ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన శిఖరం ఎవరెస్టును రెండుసార్లు అధిరోహి ంచిన భారత మహిళ సంతోష్ యాదవ్‌ను తమ వ్యవస్థాపక దినోత్సవా నికి ఆహ్వానించి రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్) ఒక కొత్త చర్చకు తెరతీసింది. అసలు మహిళలపై ఆరెస్సెస్ వైఖరి మారుతోందా అనే ప్రశ్న కూడా ఉత్పన్నం అవుతోంది. సంఘ్ పరివార్ నిబంధనల ప్రకారం, కేవలం "హిందూ పురుషులు"లు మాత్రమే ఆరెస్సెస్‌లో సభ్యులు కాగలరు. మహిళలకు ఇక్కడ ప్రత్యేక విభాగం ఉంది.దసరా రోజు ప్రసంగానికి ముందుగా ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్ దుర్గాదేవి పూజ చేశారు. ఆరెస్సెస్‌లో ఉదయం నిర్వహించే "శాఖ" మినహా.. మిగతా పనులన్నింటిలోనూ పురుషుల్లానే మహిళలు కూడా పాలుపంచుకుంటారని ఆ ఆరోజు ఆయన చెప్పారు.ఇప్పుడు తాజాగా సంతోష్ యాదవ్‌తో ఆయన వేదిక పంచుకొని మహిళలపై తమ వైఖరి మారుతోందని చెప్పే చర్చను మరో అడుగు ముందుకు తీసుకెళ్లారు. అంతేకాదు.. అంతటా శాంతి, పవిత్రతలు నెలకొనేలా చూడటంలో స్త్రీ శక్తికి ప్రాధాన్యం ఇవ్వడం అనివార్యం"అని కూడా ఆయన అన్నారు.మహిళల గురించి చర్చ వచ్చిన ప్రతిసారీ "రాష్ట్ర సేవిక సమితి" పేరును ఆరెస్సెస్ ముందుకు తీసుకొస్తుంది. సంఘ్‌లో ఇది మహిళల విభాగం. అయితే, దీని పేరు పెద్దగా వినిపించదు.నిజానికి సేవిక సమితిని కూడా ఆరెస్సెస్ అనే పిలుస్తారు. దీన్ని కూడా ప్రధాన ఆరెస్సెస్‌లానే విజయ దశమి రోజు కేశవ్ బలిరామ్ హేగ్డేవార్ మొద లుపెట్టారు.సంఘ్‌లో పురుషాధిపత్యంపై చాలా చర్చ జరుగుతుంటోంది. ఈ వైఖరిని మార్చే ప్రయత్నాల్లో భాగంగానే ప్రస్తుతం సంతోష్ యాదవ్‌ను ఆహ్వానించినట్లు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఇదివరకు కూడా కాంగ్రెస్ నాయకురాలు రాజ్‌కుమారి అమృత్ కౌర్,మాజీ ఎంపీ అనుసూ య బాయి కాలే ఇలా మరికొంత మంది ప్రముఖులను కూడా ఇదివరకు ఆరెస్సెన్ ఇలా ఆహ్వానించింది.భారత సంప్రదాయంలో స్త్రీ, పురుషులను ఒకరికొకరు తోడు-నీడగా మోహన్ భాగవత్ చెబుతుంటారు. "విదేశీ దండయాత్రల వల్ల ఈ సంప్రదాయం పూర్తిగా దెబ్బతింది. అయితే, పూజించడం లేదంటే రెండో తరగతి పౌరులుగా వంటగదికే పరిమితం చేయడం లాంటివి ఎక్కువయ్యాయి. నేడు మళ్లీ మాతృశక్తికి సాధికారత కల్పించాలి. ఉద్యోగం, కుటుంబం, ప్రజాజీవనం ఇలా అన్నింటిలోనూ వారికి సగ భాగం ఇవ్వాలి"అని ఆయన చెప్పారు.ఇటీవల సమాజంలోని భిన్న వర్గాలకు చెందిన ప్రతినిధులతో ఆరెస్సెస్ చర్చలు మొదలుపెట్టింది. సామాజిక సమస్యలు, కుల వివక్ష లాంటి అంశాలపై ఇమామ్ షాహిబ్‌తో మాట్లాడేందుకు మోహన్ భాగవత్ ముస్లింల ప్రార్థనా స్థలానికి కూడా వెళ్లారు. దీంతో ఆరెస్సెస్ వైఖరిలో మార్పు వస్తోందనే చర్చ ఎక్కువైం ది.సమాజంలో తమపై పడిన ముద్రను చెరిపేసుకోవడానికి భారతీయ జనతా పార్టీ (బీజేపీ)కి రాజకీయ లబ్ధి చేకూర్చేందుకు నేడు సంఘ్ తీవ్రంగా ప్రయత్నిస్తోందని రాజకీయ విమర్శకులు అంటున్నారు. అయితే, మహిళల విషయంలో గత మూడు దశాబ్దాలుగా ఆరెస్సెస్ వైఖరి మా రుతూ వస్తోందని సంఘ్ మద్దతుదారులు అంటున్నారు.మీరు ప్రసంగంలో భాగవత్ వాడిన పదాలను జాగ్రత్తగా గమనించండి. దానిలో పురుషాధిక్య పదజాలం చాలా కనిపిస్తుంది. అసలు సంప్రదాయ కుటుంబ వ్యవస్థకు వెలుపల మహిళలు జీవించలేరనే ధోరణిలో ఆయన మాట్లాడారు. మహిళలకు వారి శరీరాలపై వారికి హక్కులు ఇచ్చేందుకు సంఘ్ సిద్ధంగా లేదు"అని దిల్లీ జవహర్‌లాల్ యూనివర్సిటీలోని సోషియాలజీ ప్రొఫెసర్ హరీశ్ వాంఖడే అన్నారు.మోహన్ భాగవత్ తన ప్రసంగంలో మహిళల గురించి మాట్లాడేటప్పుడు పదేపదే "మాతృ-శక్తి" అనే పదాన్ని ఉపయోగిస్తూ కనిపించారు. ముఖ్యంగా మహిళల జీవితంలో "మాతృత్వం" అనే అంశానికి ఆరెస్సెస్ ఎక్కువ ప్రాధాన్యాన్ని ఇస్తుంటుంది.నాగ్‌పుర్‌కు చెందిన మరాఠీ రచయిత అరుణ సబానే ఈ విషయంపై మాట్లాడుతూ.. "తల్లి అనే పదం వారికి ఒక లక్ష్మణ రేఖ లాంటిది. మహిళలు ఈ గీత దాటి ముందుకు రాకూడదని వారు భావిస్తారు"అని ఆమె అన్నారు. 1987నుంచీ సంఘ్‌లో మహిళ లకు ప్రాధాన్యం ఇవ్వడం క్రమంగా పెరుగుతూ వస్తోందని ఏళ్ల నుంచీ ఆరెస్సెస్‌లో పనిచేస్తున్న దిలీప్ దేవధర్ అన్నారు. "ఇక్కడ సంఘ్‌లో ఒక కుటుంబ సభ్యుడు చేరితే, ఆ కుటుంబం మొత్తం దానిలో చేరినట్లే. ఇక్కడ పురుషులతోపాటు మహిళలు కూడా సంఘ్‌లో చేరినట్లుగానే భావించాలి"అని ఆయన వివరించారు.అయితే, సంఘ్‌లో మహిళల ప్రాతినిథ్యం చాలా తక్కువగా ఉందనే విషయాన్ని దిలీప్ అంగీకరించా రు. "సమాజంలో మహిళల సంఖ్యతో పోలిస్తే,వారికి సముచిత స్థానం లభించడంలేదు"అని ఆయన అన్నారు.ఎనిమిదేళ్ల విరామం తర్వాత, నేను మళ్లీ సంఘ్ విజయదశమి కార్యక్రమానికి మళ్లీ హాజరయ్యాను. ఇక్కడ ముఖ్య అతిథుల్లో చాలా మంది కనిపించారు. అయితే, "పార్థ్ సంచాలన్" సహా కొన్ని కార్యక్రమాల్లో మహిళలు కనిపించలేదు.ఈ విషయంపై అక్కడ వాలంటీర్లతో మాట్లాడినప్పుడు.. "కొన్ని కార్యక్రమాల్లో మహిళలు పాల్గొనని మాట వాస్తవమే. దీని బట్టి సంఘ్‌లో మహిళలే లేరని అనుకోకూడదు.


సూర్యసేన

దినపత్రికలో
అన్ని రకాల ప్రకటనలు
అడ్వర్టైజ్‌మెంట్స్ మరియు
వార్తల కోసం

సంప్రదించండి: 9951241048


# ఆదివాసీ హక్కుల రక్షణ, భాగస్వామ్యంతోనే



భారత రాజ్యాంగంలో ఆదివాసీ ప్రాంత పాలనకు ప్రత్యేక స్థానం ఉంది. దేశంలోని వైవిధ్యాన్ని గౌరవిస్తూ, సమానత్వాన్ని న్యాయంగా అమలు చేయాలనే సంకల్పంతో ప్రజాస్వామ్యంలో చేసిన అత్యంత సున్నితమైన ప్రయోగాలలో రాజ్యాంగం ఐదో షెడ్యూల్ ఒకటి. ఆదివాసీ సమాజాల ప్రత్యేక సామాజిక-సాంస్కృతిక స్వరూపాన్ని గుర్తించిన రాజ్యాంగం, వారి హక్కుల రక్షణ కోసం ప్రత్యేక నియమాలను రూపొందించింది. ఆర్టికల్ 244(1) మరియు ఐదో షెడ్యూల్ ద్వారా షెడ్యూల్డ్ ప్రాంతాలకు ప్రత్యేక పాలనా వ్యవస్థ ఏర్పాటయింది. సమానత్వం అంటే అందరికీ ఒకే విధమైన చట్టాలు వర్తింపజేయడం కాదని, న్యాయం సాధించాలంటే భిన్నమైన పరిస్థితులకు భిన్నమైన రక్షణ అవసరమని రాజ్యాంగం గుర్తిస్తుంది. అయితే రాజ్యాంగ పరిరక్షణ నియమాల లక్ష్యం నేపథ్యంలో ఒక కీలక ప్రశ్న లేవనెత్తుతోంది. ఆదివాసీల హక్కులను కాపాడేందుకు రూపొందించిన ఐదో షెడ్యూల్ తన లక్ష్యాన్ని నిజంగా సాధిస్తున్నదా?

2011 జనగణన ప్రకారం భారతదేశంలో షెడ్యూల్డ్ తెగల జనాభా సుమారు 10.4 కోట్లుగా ఉంది. ఇది దేశ జనాభాలో 8.6 శాతం. ఐదో షెడ్యూల్ కింద ప్రకటించిన షెడ్యూల్డ్ ఏరియాలు దేశ భూభాగంలో సుమారు 11.3 శాతం విస్తీర?ంలో ఉన్నాయి. ఇవి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, జార?ండ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో విస్తరించి ఉన్నాయి. అయితే మొత్తం ఆదివాసీ జనాభాలో కేవలం 41 శాతం మాత్రమే ఈ షెడ్యూల్డ్ ప్రాంతాలలో నివసిస్తుండగా, మిగిలిన 59 శాతం ఐదో షెడ్యూల్ రక్షణ పరిధికి బయట ఉన్నారు.

నెహ్రూ పంచశీల సూత్రం: 1958లో జవహర్‌లాల్ నెహ్రూ ప్రతిపాదించిన 'ఆదివాసీ పంచశీల సూత్రం' అభివృద్ధి పేరుతో ఆదివాసీలను ప్రధాన స్రవంతిలో బలవంతంగా కలిపివేయాలనే విలీన భావనను ఆయన తిరస్కరించారు. ఆదివాసీల సంస్కృతి, జీవన విధానం, స్వయంపాలనను గౌరవిస్తూ అభివృద్ధి జరగాలని నెహ్రూ స్పష్టం చేశారు. బయటి వారి జోక్యం తగ్గించి, అవసరమైన చోట సాంకేతిక సహాయం మాత్రమే అందించాలన్నది ఆయన దృష్టి కోణం. అంటే ఆదివాసీలే తమ ప్రాంత పాలనలో ప్రధాన పాత్ర పోషించాలి. వారి అభివృద్ధిని వారే నిర్దేశించుకోవాలి.

గవర్నర్ అధికారాలు-రాజ్యాంగ ఉద్దేశం: అవసరమనుకుంటే ఆదివాసీల హక్కుల రక్షణకు గవర్నర్ ఒక నోటిఫికేషన్ ద్వారా ఐదో షెడ్యూల్ పేరా 5(1) ప్రకారం, కేంద్ర లేదా రాష్ట్ర చట్టాలు షెడ్యూల్డ్ ఏరియాలకు వర్తించకూడదని లేదా మార్పులతో వర్తించాలని నిర?యించవచ్చు. అవసరమైతే అ మార్పులను చట్టాల అమలులోకి రాక మునుపు కాలానికి కూడా వర్తింపజేయవచ్చు. ఆ అధికారం ఆదివాసీ ప్రయోజనాలకు హానికరమైన చట్టాల నుంచి రక్షణ కల్పించే శక్తివంతమైన సాధనం. అలాగే పేరా 5(2) కింద 'శాంతి, మంచి ప్రభుత్వ పాలన' కోసం షెడ్యూల్డ్ ఆదివాసీ భూమి బదలాయింపులు, వడ్డీ వ్యాపారం, సామాజిక నియంత్రణ వంటి అంశాలపై గవర్నర్ నిబంధనలు రూపొందించవచ్చు. గిరిజన సలహా మండలి సిఫార్సులు, రాష్ట్రపతి ఆమోదం పొందిన తర్వాత ఇవి చట్టబద్ధత సంతరించు కుంటాయి.

న్యాయవ్యవస్థ పాత్ర: గత కొన్ని దశాబ్దాలుగా భారత దేశ న్యాయస్థానాలు ఐదో షెడ్యూల్‌ను విశ్లేషిస్తూ, దాని రక్షణాత్మక ఆత్మను, రాజ్యాంగ పరిమితులను స్పష్టత చేయడంలో కీలక పాత్ర పోషించాయి. సమత వర్సెస్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి మధ్య నడిచిన కేసులో (1997) షెడ్యూల్డ్ ప్రాంతాలలో గవర్నర్‌కు అసాధారణమైన రాజ్యాంగ పాత్ర ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆర్టికల్ 154, 163 కింద మంత్రివర్గ సలహాకు లోబడి కాకుండా, స్వతంత్రంగా వ్యవహరించి ఆదివాసీ హక్కులను రక్షించాల్సిన బాధ్యత గవర్నర్‌పై ఉందని తీర్పు చెప్పింది. గవర్నర్ కేవలం సంతకం చేసే అధికారి కాదని, ఆదివాసీ హక్కుల రక్షకుడని పేర్కొంది. అలాగే పి.రామిరెడ్డి కేసు (1988)లో ఆదివాసీ భూ పరాయీకరణ నిరోధించడానికి 1/70 రెగ్యులేషన్ వంటి కఠిన ఆంక్షలు రాజ్యాంగబద్ధమేనని ధృవీకరించింది. ఇది పేరా 5(2) కింద గవర్నర్ శాసనాధికారాన్ని ధృవీకరించింది. రాష్ట్ర షెడ్యూల్డ్ ప్రాంతాలలో గిరిజనేతరుల పేర భూ బదలాయింపులు 1/70 రెగ్యులేషన్ నిషేధిస్తుంది. అంటే ఆదివాసీలు, గిరిజనేతరుల మధ్య అలాగే గిరిజనేతరుల మధ్య భూ బదలాయింపులు కూడా చెల్లవు. 1/70 రెగ్యులేషన్ అమలు విషయంలో ప్రభుత్వాన్ని కూడా గిరిజనేతరులుగానే భావించాలని సుప్రీంకోర్టు సమత కేసులో పేర్కొంది.

అదే విధంగా, అమరేంద్ర ప్రతాప్ సింగ్ వర్సెస్ తేజ్ బహదూర్ ప్రజాపతి (2003) కేసులో, ఆదివాసీ భూములపై అనాదరణ స్వాధీనం ద్వారా గిరిజనేతరులు హక్కు సంపాదించలేరని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. సాధారణ చట్ట సూత్రాలు రాజ్యాంగ రక్షణలను అధిగమించలేవని స్పష్టం చేసింది. బాల్కో ఉద్యోగుల సంఘం వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (2002) కేసులో కూడా, ఆదివాసీలకు అనుకూలమైన రిజర్వేషన్లు వంటి రక్షణాత్మక చర్యలు సమానత్వ సూత్రానికి విరుద్ధం కాదని, ఆర్టికల్ 15(4), 46 కింద అవి సమర్థనీయమని సుప్రీంకోర్టు పేర్కొంది. అయితే వాస్తవానికి షెడ్యూల్డ్ ప్రాంత ఆదివాసీ ప్రయోజనాలకు రాష్ట్ర, కేంద్ర చట్టాలు అనుకూలంగా లేదా భిన్నంగా ఉన్నాయా అనేది ముందుగా పరిశీలించే సమర్థవంత మైన వ్యవస్థ చాలా రాష్ట్రాల గవర్నర్ కార్యాలయాల్లో లేదు. ఫలితంగా సాధారణ చట్టాలు యథేఛగా ఈ ప్రాంతాలకు వర్తించి ఆదివాసీ రక్షణ కోసం ఉద్దేశించిన రాజ్యాంగ ప్రత్యేక రక్షణలు క్రమంగా బలహీ నపడుతున్నాయి.

గత న్యాయ స్థానాల భావజాలం, ఆదివాసీ హక్కుల రక్షణ విషయంలో చూసే కోణంతో పోలిస్తే ప్రస్తుత న్యాయస్థానాల ఆలోచన, తీర్పుల స్వభావంలో చాలా మార్పు కనిపిస్తున్నది. దానివల్ల ఆదివాసీ హక్కుల పరిరక్షణ మరింత జటిలమవుతున్నది.

తాజా న్యాయ ధోరణులు-కొత్త సవాళ్లు: చేబ్రోలు లీలా ప్రసాద్‌రావు వర్సెస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం (2020) కేసులో ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం, షెడ్యూల్డ్ ప్రాంతాల్లో స్థానిక ఆదివాసీలకు 100 శాతం ఉపాధ్యాయ పోస్టుల రిజర్వేషన్‌ను రద్దు చేసింది. గవర్నర్ అధికారాలు ప్రత్యేకమైనవే అయినప్పటికీ అవి రాజ్యాంగంలోని సమానత్వ సూత్రాలు,

రిజర్వేషన్ పరిమితులకు లోబడి ఉండాలన్నది కోర్టు అభిప్రాయం. ఈ తీర్పు ప్రాథమిక హక్కుల ప్రాధాన్యతను సూచించినప్పటికీ, అనుకోని ప్రతికూల తీవ్ర ప్రభావాలను ఆదివాసీ జీవనం, ఉనికిపై కలిగించింది. దానివల్ల ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో షెడ్యూల్డ్ ఏరియాల్లో వేలాది స్థానిక ఆదివాసీ ఉపాధ్యాయ, ఇతర ప్రభుత్వ నియామకాలకు ఆటంకం ఏర్పడింది. ఆంధ్రప్రదేశ్‌లోనే ఐదో షెడ్యూల్ పేరా 5(1) కింద గవర్నర్ జారీ చేసిన సుమారు 23 నోటిఫికేషన్ల ద్వారా 4,626 ఉపాధ్యాయ పోస్టులు స్థానిక ఆదివాసీలతో గతంలో భర్తీ అయ్యాయి. ఇక పేరా 5(1) కింద గవర్నర్ ఆదివాసీల ఉద్యోగ నియామక విషయంలో నోటిఫికేషన్ ఇవ్వలేరు..!

# ఆమె వైద్యానికి షష్టిపూర్తి



సమయం.. ఉదయం ఎనిమిది గంటలు. ఆపరేషన్ గది బయట లైటు వెలిగింది. హార్ట్ మానిటర్ చప్పుడు స్పష్టంగా సెకండ్లను లెక్కపెడుతున్నట్టు వినిపిస్తున్నది. ఎమర్జెన్సీ సర్జరీకి సరంజామా సిద్ధమైంది. వీటన్నిటితో పోటీ పడుతూ చకచకా చేతులు కదుపుతున్నదో వైద్యురాలు. అన్నిటికన్నా అక్కడ ఆమే ప్రత్యేకం. ఎందుకంటే ఆమె వైద్యానికి షష్టి పూర్తి నిండింది. ఆమె వయసు 92 దాటింది. మూడు తరాలకు పురుడు పోసి పుణ్యం కట్టుకున్న ఆమే పేదల వైద్యురాలిగా పేరున్న హైదరాబాద్‌కి చెందిన గైనకాలజిస్టు డాక్టర్ సూరి శ్రీమతి! తన సుదీర్ఘ జీవన ప్రయాణాన్ని, దాన్ని సాధించే రహస్యాల్ని అందరికోసం జిందగీతో పంచుకున్నారు. ఇన్ని సంవత్సరాలుగా వైద్యం ఎలా చేస్తున్నారు అని అడుగుతుంటారు చాలామంది. వయసైపోయింది అని తినడం మానేయలేదే. మరి మనకొచ్చిన పని మాత్రం ఎందుకు మానేయాలి? చక్కగా మూడు పూటలా తింటున్నది అరుగుతున్నప్పుడు ఊరికే కూర్చొని ఉండాలని ఎందుకు కోరుకోవాలి? నేను భగవంతుణ్ని, ముఖ్యంగా సత్యసాయిబాబాను చాలా నమ్ముతాను. వైద్యం దేవుడు చేస్తాడు. క్రెడిట్ డాక్టర్ తీసుకుంటారు అని అనుకుంటాను. కాబట్టి చేస్తున్నది నేను కానప్పుడు ఆపే హక్కు కూడా నాకెక్కడిది. ఉద్యోగం చేసినప్పటి సంగతి వేరు. ఉస్మానియా, నీలోఫర్, గాంధీ ఆసుపత్రులతో పాటు నిజామాబాద్, కర్నూలు, గోదావరి జిల్లాలూ ఇలా చాలా చోట్ల పనిచేశా. దవాఖానాలో కంటిన్యూగా 32 గంటలపాటు డ్యూటీ చేసేదాన్ని. ఇప్పుడు ఇంట్లోనే ఆసుపత్రి కాబట్టి కాసేపు విశ్రాంతి తీసుకునే అవకాశమూ ఉంటుందిగా. మరో విషయం నేను వైద్యవృత్తిలో చేరేటప్పుడు నా దగ్గరికి వైద్యం కోరి వచ్చిన ఏ వ్యక్తికైనా నా శక్తిమేరకు తప్పకుండా చికిత్స చేస్తానని ప్రమాణం చేశాను. అలాంటప్పుడు దాన్ని నేను పాటించాల్సిందేగా!

యోగా జీవనం: జనంలో యోగా మీద ధ్యాస మా చిన్నప్పటితో పోలిస్తే ఇప్పుడు చాలా పెరిగింది. ఇది ప్రతి మనిషీ చెయ్యాల్సిన ప్రధానమైన క్రియ అని చెబుతాన్నేను. మా నాన్నగారు సూరి రాఘవ దీక్షితులు హైదరాబాద్‌కి యోగాను పరిచయం చేశారు. ఆయన మన దేశంలోని ప్రముఖ యోగా గురు ధీరేంద్ర బ్రహ్మచారి దగ్గర యోగా నేర్చుకున్నారు. ఆ తర్వాత హైదరాబాద్‌లోని కోఠిలోని గాంధీ జ్ఞానమందిర్‌లో ఒక యోగా కేంద్రాన్నీ, సికింద్రాబాద్‌లోని గీతాభవన్‌లో మరో కేంద్రాన్నీ ప్రారంభించారు. నేటికీ అవి కొనసాగుతూనే ఉన్నాయి. అంతేకాదు, రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ పలుచోట్ల ఆయన స్థాపించిన వివిధ యోగా సెంటర్‌లు ఇప్పటికీ జనానికి ఆరోగ్య ప్రసాదాన్ని పంచుతూనే ఉన్నాయి. నాన్న రైల్వేలో పనిచేసేవారు. ఆ ట్రాన్స్‌ఫర్లు ఆయనకు రకరకాల చోట్ల కేంద్రాలు స్థాపించేందుకు అవకాశాన్నిచ్చాయి. ఉద్యోగం చేసేవారు కూడా సమయం లేదనకుండా చక్కగా యోగా చేసుకోవచ్చు అనడానికి ఆయనే ఉదాహరణ. ఇక, నాన్నకు యోగాతో అంత అనుబంధం ఏర్పడటానికీ, దాన్ని ఇంత మందికీ చేరువ చేయడానికీ వెనుక ఓ ముఖ్యమైన ఘట్టం ఉంది. ఆయన యువకుడిగా ఉన్నప్పుడు ఎగ్జిమా అనే చర్మవ్యాధి బారిన పడ్డారు. దాంతో చర్మం మందంగా మారిపోయి, దురదతో చాలా ఇబ్బంది పడేవారట. యోగా ద్వారా అది మాయం అయింది. అప్పుడు ధీరేంద్ర బ్రహ్మచారిని గురు దక్షిణ ఏమి ఇమ్మంటారని అడిగితే, నీలాగే పదిమందీ దీని ద్వారా లబ్ధి పొందేలా యోగాను వ్యాప్తి చేయమన్నారట. అలా మా కుటుంబం యోగాకు దగ్గరైంది.

మేం ఏడుగురం పిల్లలం. అమ్మ జోతిష్మతి. ఇంట్లో అందరం యోగా చేసేవాళ్లం. ఇందులో ముఖ్యంగా సూర్యనమస్కారాలు ప్రధానమైనవి. ఇవి శరీరంలోని ప్రతి అవయవాన్నీ యాక్టివేట్ చేస్తాయి. ఇవి చేయడం ద్వారా ఎముకలకు, జీవక్రియకు ప్రధానమైన డి- విటమిన్‌ను సంపాదించుకోవచ్చు. నేను కొన్నేండ్ల ముందు దాకా కూడా ఇవి చేసేదాన్ని. అలాగే ప్రాణాయామం కూడా చాలా ప్రధానం. ఇందులో కూడా చాలా రకాలుంటాయి. నేటికీ ఈ శ్వాస సంబంధిత వ్యాయామాలు చేస్తాను. వెన్నునొప్పి, సైనసైటిస్‌లాంటి రకరకాల జబ్బులు తగ్గించడానికి కూడా యోగా చాలా ఉపయోగపడుతుంది. ముఖ్యంగా నేటి పరిస్థితుల్లో ఆరోగ్యంగా జీవించడానికి ఇది ప్రధానం.

అదే సంతోషం: హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో ప్రసూతి వార్డుకు నా పేరు పెట్టారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వారి జీవిత సాఫల్య పురస్కారం, ఫెడరేషన్ ఆఫ్ అబ్‌స్టాట్రిక్ అండ్ గైనకలాజిక్ సొసైటీ ఆఫ్ ఇండియా నుంచి అవుట్ స్టాండింగ్ కంట్రిబ్యూషన్ అవార్డు, యూకే రాయల్ కాలేజీ వారి గౌరవ ఫెలోషిప్ సహా ఎన్నో పేరెన్నికగన్న అవార్డులు ఈ ప్రయాణంలో అందుకున్నా. అవి నాకు సంతోషాన్ని కలిగించేవే అయినా నేను చేసిన పనికి అమిత ఆత్మసంతృప్తి పొందిన సందర్భాలు వేరే ఉన్నాయి. అందులో ఒకటి చెబుతాను. ఓసారి మెడికల్ క్యాంపు నిమిత్తం ఒక ఊరికి వెళ్లాల్సి ఉంది. డాక్టర్లందరం ఫలానా సమయానికి ఫలానా చోట కలుద్దాం అనుకున్నాం. అయితే నేను ఆ సమయానికి వెళ్లలేకపోయాను. క్యాంపు మిస్సయ్యాను. దీంతో చాలా నిరాశగా వెనుదిరిగాను. ఇంటి తలుపు వేస్తున్నానో లేదో, ఓ ఎమర్జెన్సీ కేసు వచ్చింది. నిండు గర్భిణి. గర్భసంచి పగిలిపోయి లోపలే రక్తం కారిపోతున్నది. అప్పటికప్పుడు సర్జరీ చేసి, బిడ్డనూ, తల్లినీ ఇద్దర్నీ రక్షించా. అప్పుడర్థమైంది నా ప్రయాణం ఎందుకు రద్దయిందో. కొందరు నా దగ్గరికి వచ్చి 'మా అమ్మమ్మకు, అమ్మకు మీరే డెలివరీ చేశారు డాక్టర్ అందుకే కాన్పు కోసం మీ దగ్గరికే వచ్చా' అని చెబుతుంటారు. మూడు తరాలు నా చేతిలోనే పురుడు పోసుకున్న సందర్భాలు ఒక నిండైన అనుభూతిని కలిగిస్తుంటాయి. అలాగే, పెద్ద సమస్యతో వచ్చి మన ద్వారా బాగైన వాళ్ల కళ్లలో కనిపించే ఆనందం నిజంగా చెప్పలేనంత సంతృప్తిని ఇస్తుంది. అది నేను ఇంకా సంపాదించుకుంటూనే ఉన్నా. అదీ నాకు ఓ బలమేనేమో!

అదే సూత్రం: చదువు పూర్తయిన నాటి నుంచి రిటైర్ అయిన దాకా ప్రభుత్వంలో పనిచేశా. మా ఇల్లు సాధారణ జనం ఉండే ప్రాంతంలో ఉంటుంది. వైద్యం కోసం ఇంటిముందుకు వచ్చిన వారిని కాదని అనలేను. వాళ్లందరికీ అందుబాటులో ఉండటమే నాకు కూడా న్యాయమనిపించింది. అందుకే నా దగ్గర ఫీజు తక్కువన్న పేరు వచ్చింది. మా ఇంట్లో కొవిడ్‌కు ముందు వరకూ యోగా కూడా ఉచితంగా నేర్పేవాళ్లం. మెడికల్ కాలేజీలో నా దగ్గర పాఠాలు నేర్చుకున్న వాళ్లలో పేరెన్నికగన్న వైద్యులు ఉన్నారు. వాళ్లకు నేను చదువుతో పాటు విలువల గురించీ చెబుతా. ఎదుటి మనిషి స్తోమతను బట్టి వైద్యంసూచించమంటా. లేదంటే వాళ్లకు అందుబాటులో ఉన్న వైద్యం ఫలానా దగ్గర దొరుకుతుందని అయినా చెప్పమని చెబుతా. రోగులతో మృదువుగా మాట్లాడాలనీ, వారిని చిన్నబుచ్చుకునేలా ఎప్పుడూ చేయొద్దన్న సూచన కూడా నేను పాటిస్తూ వాళ్లకీ చెబుతుంటా.

మీకూ ఆరోగ్యం: మా కాలానికీ ఇప్పటికీ వాతావరణం చాలా మారింది. కాబట్టి మంచి ఆరోగ్యం కోసం నేను కొన్ని విషయాలు చెబుతా. మీరు అపార్ట్‌మెంట్లో ఉన్నా సరే, టెర్రస్ మీదకి వెళ్లి కాసేపు చిన్నపాటి వ్యాయామం చేస్తూ ఎండ తగిలేలా కొంత సమయం గడపండి. శరీరం చురుగ్గా ఉండటానికి ఇది చాలా ప్రధానం. పురుగుమందులు విపరీతంగా వాడుతున్న ఈ తరుణంలో పండ్లు, కూరగాయలు బాగా కడిగి తినాలి. వాయుకాలుష్యం తట్టుకునేందుకు శ్వాస సంబంధిత వ్యాయామాలు చేయండి. పిల్లల ఎదుగుదల సక్రమంగా ఉండాలంటే బాగా ఆటలు ఆడించాలి. యుక్త వయసు వచ్చిన ఆడపిల్లలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయించడం ద్వారా వాళ్లను కొన్ని క్యాన్సర్‌ల నుంచి కాపాడుకోవచ్చు. ఇక మితాహారం, అందులోనూ సమతులాహారం మనల్ని దీర్ఘకాలం ఆరోగ్యంగా ఉంచుతాయి. ఆహారం ఎలా తీసుకోవాలన్న దానికి నాన్న చెప్పే సూత్రం ఒకటి చెబుతా 'డ్రింక్ సాలిడ్స్ ఈట్ లిక్విడ్స్'. ఘన పదార్థాలను తాగేందుకు అనుకూలం అన్నంత మెత్తగా నమిలి మింగాలి. అప్పుడు లాలాజలంతో ఊరే ఎంజైమ్‌ల ద్వారా అది హాయిగా జీర్ణం అవుతుంది. ద్రవ పదార్థాలను తిన్నట్టుగా అంటే నెమ్మదిగా కొద్ది కొద్దిగా చప్పరిస్తూ మింగాలి.

## ఎన్నికలను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకునేందుకు రాజకీయ పక్షాలు సహకరించాలి




**– జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

**సూర్యాపేట, జనవరి 29 (సూర్య సేన) :** సూర్యాపేట జిల్లాలో మున్సిపల్ ఎన్నికలను స్వేచ్ఛగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని రాజకీయ పక్షాలు సహకరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ కోరారు. మున్సిపల్ ఎన్నికలపై గురువారం ఆయన సూర్యాపేట జిల్లా సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలోని తన చాంబర్లో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 28 నుండి 30 వరకు నామినేషన్ల స్వీకరణ, 31న నామినేషన్ల పరిశీలన, ఫిబ్రవరి 3 న నామినేషన్ల ఉపసంహరణ, ఫిబ్రవరి 11 న ఉదయం 7 నుండి సాయంత్రం 5 గంటల వరకు మున్సిపల్ ఎన్నికల పోలింగ్, ఫిబ్రవరి 13 న ఉదయం 8 గంటల నుండి ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతాయని తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన రోజు నుండి ఎన్నికల ప్రవర్తనా నియమావళి వెంటనే అమలులోకి వచ్చిందని, అందువలన రాజకీయ పార్టీలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తూ.చా తప్పకుండా పాటించాలని కోరారు. శుక్రవారం నామినేషన్లకు చివరి రోజు అయినందున పెద్ద మొత్తంలో నామినేషన్లు వేసే అవకాశాలున్నందున ఆయా పార్టీల వారు వారి తరఫున నామినేషన్ కేంద్రాల వద్ద ప్రత్యేకంగా ఒక మనిషిని ఏర్పాటు చేసి నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేసుకునే విధంగా ఏర్పాటు చేయాలని కోరారు. మున్సిపల్ ఎన్నికలలో ఓటర్లు ఓటు వేసే విషయంలో ప్రభుత్వం తరఫున అవగాహన కల్పిస్తామని, అలాగే రాజకీయ పార్టీలు సైతం అవగాహన కల్పించాలని, వేసిన ఓట్లు చెల్లుబాటు అయ్యేలా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ఎన్నికల వ్యయం ,ఎన్నికల ప్రవర్తనా నియమావళి తదితర అన్ని అంశాలపై అవగాహన కల్పిస్తామని, పోస్టల్ బ్యాలెట్ కు సంబంధించిన తేదీలను త్వరలో ప్రకటిస్తామని, జిల్లాలో ఓట్ల లెక్కింపు కు సూర్యాపేటలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అదనపు కలెక్టర్ కె. సీతారామరావు మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల సందర్భంగా రాజకీయ పార్టీలు పాటించవలసిన నియమ నిబంధనలు, ఇతర అంశాలను తెలియజేశారు. జిల్లాలో అన్ని మున్సిపాలిటీలలో 2లక్షల 26,586 మంది ఓటర్లు వారి ఓటు హక్కును వినియోగించుకొనున్నారని, ఇందుకుగాను 141 వార్డులలో, 372 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. 57 మంది రిటర్నింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లను నియమించి శిక్షణ ఇచ్చామని, నోడల్ ఆఫీసర్లను, ఎఫ్ ఎస్ టి ,ఎస్ ఎస్ టి బృందాలన్నింటిని ఏర్పాటు చేశామని వెల్లడించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ నామినేషన్ ఫారం లో పోలింగ్ బూత్ నంబరు ఉండాలని, ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో విశాలంగా ఉ ండేలా చూడాలని కోరారు. ఈ సమావేశానికి ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ నుండి చక్కిలం నాగేశ్వరరావు, బిజెపి నుండి హబీబ్, బీఎస్పీ నుండి స్టాలిన్, సిపిఐ ఎం నుండి కే .గోపి ,వైఎస్ఆర్సిపి నుండి రమేష్ ,బి ఆర్ ఎస్ నుండి కరుణాకర్ రెడ్డి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ సంతోష్ కిరణ్, తదితరులు హాజరయ్యారు.

## రోడ్డు భద్రతపై ప్రజలలో అవగాహన అవసరం

**– జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్**

**నల్గొండ, జనవరి 29 (సూర్య సేన) :** రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన అత్యంత అవసరం అని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా రవాణా శాఖ ఆధ్వర్యంలో గురువారం రవాణా శాఖ ఆధ్వర్యంలో ఎన్ జి కాలేజ్ నుండి రామ్ గిరి,క్లాక్ టవర్ వరకు నిర్వహించిన రోడ్డు భద్రత అవగాహన బైక్ ర్యాలీని జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ లు జండా ఊపి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుత రోడ్డు ప్రమాదాల వల్ల అనేక మంది విలువైన ప్రాణాలను కోల్పోతున్నారని, ఇది అత్యంత ఆందోళనకరమని అన్నారు.రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల్లో అవగాహన పెంపొందించడమే జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల ప్రధాన లక్ష్యమని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీట్‌బెల్ట్ వాడాలని సూచించారు. ముఖ్యంగా యువత ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలవాలని కోరారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ, అధిక వేగం, మద్యం సేవించి వాహనం నడపడం, మొబైల్ ఫోన్ వినియోగిస్తూ డ్రైవింగ్ చేయడం రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలని అన్నారు. ఒక్క క్షణ నిర్లక్ష్యం జీవితాంతం పశ్చాత్తాపంగా మారుతుందని హెచ్చరించారు. ట్రాఫిక్ పోలీసుల సూచనలను గౌరవిస్తూ, రహదారిపై శాసనబద్ధంగా ప్రయాణించడమే సురక్షిత జీవనానికి మార్గమని పేర్కొన్నారు. జిల్లా రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ ఎన్ . వాణి, డిటివో లావణ్య, డీఎస్పీ శివరాం రెడ్డి, ఎం వి ఐ కొండయ్య, మల్లికార్జున్ రెడ్డి, స్వప్న ,యువకులు ఈ బైక్ ర్యాలీలో పాల్గొన్నారు.

## మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యధాతథంగా కొనసాగించాలి




**– సిపిఐఎంఎల్ మాస్ లైన్ పార్టీ తుంగతుర్తి డివిజన్ కార్యదర్శి పేర్ల నాగయ్య.**

**తుంగతుర్తి ప్రతినిధి, జనవరి 29 (సూర్య సేన) :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యధాతథంగా కొనసాగించాలని నాలుగు లేబర్ కోడ్ చట్టాలను వెంటనే రద్దు చేయాలని సిపిఐఎంఎల్ మాస్ లైన్ పార్టీ తుంగతుర్తి డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో తహశీల్దార్ దయానందంకి వినతి పత్రం సమర్పించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కోట్లాది గ్రామీణ కార్మికులకు జీవనోపాధిగా నిలిచిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి పేరు మార్చడం అత్యంత దారుణమని కేంద్ర ప్రభుత్వం మతోన్మాద ఫాసిస్టు విధానాలను కొనసాగిస్తూ గ్రామీణ వ్యవసాయ కూలీల కార్మికుల హక్కులను హరించే విధంగా చట్టాలను సవరిస్తూ దళారీ పెట్టుబడిదారీ కార్పొరేట్ వర్గాలకు ఊడిగం చేస్తుందని ఆరోపించారు. ప్రభుత్వ పథకాల పనితీరును మెరుగుపరచడం కూలీలకు సకాలంలో జీతాలు చెల్లించటం పారదర్శకతను పెంచటం అనేది ప్రభుత్వ బాధ్యతని పేరు మార్చడం ద్వారా అభివృద్ధి సాధ్యం కాదని 12 గంటల పని విధానంతో కార్మికుల అదనపు శ్రమను కార్పొరేట్ వర్గాలకు దోచిపెడుతుందని ఆరోపించారు. ఉపాధి హామీ పథకాన్ని నీరు కార్చి రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నిందన్నారు. వెంటనే నాలుగు లేబర్ కోడ్ చట్టాలను రద్దుచేసి ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని లేనిఎడల రాబోవు రోజులలో అన్ని ప్రజా సంఘాలతో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కామ్రేడ్ గొడ్డలి నరసన్న, నాయకులు మామిడి సుధాకర్, గుండగాని వెంకన్న,రాములు నాయక్,మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో మాలలకు తగిన ప్రాధాన్యత కల్పించాలి

**– మూడు కౌన్సిల్, ఒక కోఆప్షన్ స్థానం కేటాయించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేత**



**కోదాడ ప్రతినిధి, జనవరి 29 (సూర్యసేన) :** మున్సిపల్ ఎన్నికల్లో మాలలకు మూడు కౌన్సిల్ ఒక కోఆప్షన్ స్థానం కల్పించాలని కోరుతూ మాల మహానాడు జాతీయ అధ్యక్షులు తాళ్లపల్లి రవి ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి ని కోరారు. గురువారం కోదాడ పట్టణంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి పిడతల శ్రీనుతో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాన్ని అందించారు. కోదాడ పురపాలక సంఘం ఏర్పడిన నాటి నుంచి మాలలకు ఎటువంటి ప్రాధాన్యత కల్పించలేదని తాము గత 40 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ పార్టీ అభివృద్ధికి ఎంతగానో సేవ చేశామని గుర్తు చేశారు. ఎస్సీ వర్గీకరణ ప్రకారం తమకు రావాల్సిన వాటాలో అవకాశం కల్పించాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ తప్పక అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పిడతల శ్రీను, లచ్చిమళ్ల రామ్మోహన్ రావు, గాదరి మధు, ప్రవీణ్ కుమార్, నాగరాజు, కొండలు, ఏసు, రాయప్ప, శంకర్ రావు, రమేష్, కృష్ణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## చింతల వీరయ్య మృతి అన్ని వర్గాల ప్రజలకు తీరని లోటు



**– చింతల వీరయ్య కుటుంబాన్ని పరామర్శించిన లారీ అసోసియేషన్ నాయకులు**

**కోదాడ ప్రతినిధి, జనవరి 29 (సూర్యసేన) :** చింతల వీరయ్య మృతి వర్తక వాణిజ్య వ్యాపార రంగాలతో పాటు అన్ని వర్గాల ప్రజలకు తీరని లోటు అని పలువురు లారీ అసోసియేషన్ నాయకులు అన్నారు. గురువారం కోదాడ పట్టణంలో ఇటీవల మృతి చెందిన కాన్వాసింగ్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు వీరయ్య నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మంచితనానికి, మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా ఉండే వీరయ్య మన మధ్యన లేకపోవడం చాలా బాధాకరం అన్నారు. ఆయన మృతి రైతులకు, మిల్లర్లకు, లారీ అసోసియేషన్ కు తీరని లోటు అన్నారు. ఈ కార్యక్రమంలో లారీ అసోసియేషన్ నాయకులు పైడిమర్రి వెంకటనారాయణ, ఆవుల రామారావు, రామినేని శ్రీనివాసరావు, యలమందల నరసయ్య, తోట శ్రీను తదితరులు పాల్గొన్నారు.


## కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి – శ్రీరాములు అందెల

**– రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యం సమరశీలుల్లా పనిచేయాలి**

**– ముఖ్య నాయకుల సమావేశంలో శ్రీరాములు అందెల**



**రంగారెడ్డి, జనవరి 29 (సూర్య సేన) :** రానున్న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని, బీజేపీ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్, మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ ఇన్చార్జిఅందెలశ్రీరాములులిపిలుపునిచ్చారు. మహేశ్వరం నియోజకవర్గం జీహెచ్ఎంసీ పరిధిలోని బడంగ్‌పేట్ సర్కిల్‌లో గల జిల్లెల గుడా, మీర్‌పేట్, ప్రశాంతి హిల్స్ డివిజన్లకు సంబంధించిన ముఖ్య నాయకుల సమావేశం నియోజకవర్గ బీజేపీ కార్యాలయంలో క్లస్టర్ 1 ఌ 2 అధ్యక్షులు పసునూరి బిక్షపతి చారి, తులసి ముఖేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా శ్రీరాములు హాజరై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ ప్రజల నమ్మకాన్ని కోల్పోయిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు ఇచ్చి అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, అభివృద్ధి, సంక్షేమం పేరుతో ప్రజలను మోసం చేస్తోందని తీవ్రంగా విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ప్రతి కార్యకర్త ప్రజల్లోకి తీసుకెళ్లి, నిజాలను స్పష్టంగా వివరించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు దేశవ్యాప్తంగా పేద, మధ్యతరగతి ప్రజలకు ఎలా ఉ పయోగపడుతున్నాయో ఇంటింటికీ వివరించాలని సూచించారు. డబుల్ ఇంజిన్ సర్కార్ వల్లే అభివృద్ధి సాధ్యమని ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. బూత్ స్థాయి నుంచి డివిజన్ స్థాయి వరకు పార్టీని మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రతి నాయకుడు, కార్యకర్తపై ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మీర్ పెట్ కార్పొరేషన్ బిజెపి ప్రధాన కార్యదర్శిలుధ్యాసాన్ని తిరుపతిరెడ్డి ,ఇందిరావత్ రవి నాయక్, సిద్దాల శ్రీనివాస్, వెంకట్ రెడ్డి ,. మాజీ ఫ్లోర్ లీడర్ కీసర గోవర్ధనరెడ్డి మాజీ అధ్యక్షులు పెండాల నరసింహ,వరికుప్పల బుచ్చి రాములు. జిల్లా కౌన్సిల్ సభ్యులు కోడూరు సోమేశ్వర్ ముత్తంగి కరుణానిధి. మాజీ ప్రజా ప్రతినిధులుఏ బీమరాజ్. నీలారవి నాయక్. విజయలక్ష్మి రాజు. ఎడ్ల మల్లేష్ ముదిరాజ్. గౌరీ శంకర్. కీసర కృష్ణారెడ్డి బెల్లంకొండ ప్రవీణ్ కిషోర్ అమర్నాథ్ రెడ్డి. మాజీ ప్రధాన కార్యదర్శిగాజుల మధు .బిజెపిఎస్సీ మోర్చ రాష్ట్ర నాయకులు చేవ్వ శ్రావణ్ స్థూల ప్రభాకర్ బెల్లంకొండ నాగరాజు. ఎస్టి మోర్చా అధ్యక్షుడు పార్టీ ఉపాధ్యక్షురాలు కుందనం లత శ్రీ శాంతి కిరణ్. ఎల్ హరిత రెడ్డి. పోలెరాజు. శీను నాయక్. బీజేవైఎం జిల్లా నాయకులు మన్నెం రవీందర్ రెడ్డి. రాఘవేందర్ . ఓబిసి మోర్చ అధ్యక్షులు తుమ్మల రమేష్. బీజేవైఅధ్యక్షులుప్రదీప్. చిల్లంపల్లి రాజశేఖర్ మల్లికార్జున్. విక్కి సాగర్ లిక్కికృష్ణారెడ్డి ఆవుల సత్తయ్య. శ్రీనివాస్ రెడ్డి ప్రశాంత్. యువ నాయకులు మనీష్ ముదిరాజ్. రాఘవేందర్ గౌడ్, బొంతుకృష్ణ జై కాంత్ చిరంజీవి గౌడ్. అనిల్. రవీందర్ గౌడ్. రమేష్. భూషణము రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, మాజీ కార్పొరేటర్లు, వివిధ మోర్చాలనాయకులు పాల్గొన్నారు.



## కార్పొరేట్లకు రుణమాఫీ... రైతుకు కన్నీరే!



**గరిడేపల్లి ప్రతినిధి, జనవరి 29 (సూర్య సేన) :** గరిడేపల్లి మండలం రాయినగూడెం గ్రామంలో మంగళవారం సీపీఎం పార్టీ ప్రాంతీయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి గ్రామానికి చెందిన రాచమల్ల నరసయ్య అధ్యక్షత వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సీపీఎం మండల కార్యదర్శి ఎస్.కే. యాకూబ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పదేళ్ల పాలనలో లక్ష మందికి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం, ఇప్పటివరకు ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదని విమర్శించారు. నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతుండటంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అయితే పంట పండించే రైతుకు మాత్రం మిగిలేది అప్పులు, కన్నీరేనని అన్నారు. పంట నష్టపోతే రైతులకు భరోసా ఇవ్వాల్సిన పంట బీమా పథకం కేవలం మాటలకే పరిమితమైందని, రైతులకు చేరవేయడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రైతులు పంట రుణాలు తీసుకుంటే బ్యాంకులు వెంటబడి వసూలు చేస్తున్నాయని, అదే సమయంలో కార్పొరేట్ కంపెనీలకు రూ. 17 లక్షల కోట్లకు పైగా రుణాలు మాఫీ చేయడం అన్యాయమన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతన్న పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు అమలు చేస్తామని కాలయాపన చేస్తోందని, ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యుత్ సవరణ బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు దోసపాటి భిక్షం, రాచమల్ల నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతల్లో రాజీ లేదు నామినేషన్ కేంద్రాల పరిశీలనలో డిఎస్పీ శ్రీనివాస్ రెడ్డి...




**హుజూర్నగర్ ప్రతినిధి, జనవరి 29 (సూర్య సేన) :** సూర్యాపేట జిల్లా హుజూర్నగర్ మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలోని నామినేషన్ కేంద్రాలను జిల్లా డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక సీఐ చరమంద రాజుతో కలిసి నామినేషన్ హాల్స్‌ను, అభ్యర్థుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్కులను తనిఖీ చేశారు. నామినేషన్ల ప్రక్రియ సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసులు పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు డిఎస్పీ తెలిపారు. ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలను అభ్యర్థులు తూచా తప్పకుండా పాటించాలని సూచించారు. నామినేషన్ పత్రాల్లో ఎలాంటి లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రక్రియ సాఫీగా సాగేందుకు పోలీసు యంత్రాంగానికి సహకరించాలని కోరారు. ప్రజాస్వామ్య పద్ధతిలో అభ్యర్థులందరూ ప్రశాంతంగా తమ నామినేషన్లు దాఖలు చేసుకోవాలని, శాంతి భద్రతల విషయంలో ఎక్కడా రాజీ పడే ప్రసక్తి లేదని డిఎస్పీ శ్రీనివాస్ రెడ్డి ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

ఈ పరిశీలనలో సీఐ చరమంద రాజు, ఎస్సై మోహన్ బాబు, ఏఎస్సై బలరామిరెడ్డి తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కేసీఆర్‌ను ముట్టుకుంటే రాష్ట్రం అగ్నిగుండం : మల్లయ్య యాదవ్



**– సిట్ నోటీసులపై బీఆర్ఎస్ ఆందోళన.. గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పణ**

**కోదాడ ప్రతినిధి, జనవరి 29 (సూర్యసేన) :** సిట్ నోటీసుల పేరుతో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఇబ్బంది పెట్టాలని ప్రయత్నిస్తే రాష్ట్రం అగ్నిగుండంగా మారుతుందని, ఆ అగ్నికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆహుతి కావాల్సి వస్తుందని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ హెచ్చరించారు. కేసీఆర్‌కు సిట్ నోటీసులు అందజేయడాన్ని ఖండిస్తూ గురువారం బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి మహాత్మా గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మల్లయ్య యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి పాలన తుగ్లక్, హిట్లర్ పాలనల మిశ్రమంలా మారిందని విమర్శించారు. నడిరోడ్డుపై హత్యలు, వేల కోట్ల రూపాయల స్కాంలు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. అవినీతి సంపాదనపైనే దృష్టి పెట్టి ప్రజా సంక్షేమం, అభివృద్ధిని గాలికి వదిలేశారని ఆరోపించారు. కేసీఆర్‌ను మానసికంగా ఇబ్బంది పెట్టడమే ముఖ్యమంత్రి ఏకైక లక్ష్యంగా మారిందన్నారు. కాంగ్రెస్ 60 ఏళ్ల పాలనలో తెలంగాణను ఎడారిగా మార్చిందని, నీరు, కరెంటు లేక ప్రజలు వలసలు వెళ్లే పరిస్థితి తీసుకువచ్చిందని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కోట్లాది మందిని సమీకరించి ప్రత్యేక రాష్ట్రం సాధించిన ఘనత కేసీఆర్‌దేనని అన్నారు. అటువంటి నాయకుడిపై ఆధారంలేని ఆరోపణలు చేసి అధికారులను ఉపయోగించి ఇబ్బంది పెట్టాలని చూస్తే ప్రజలు సహించరని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# మున్సిపల్ ఎన్నికలకు టీడీపీ దూరం....



**కోదాడ ప్రతినిధి, జనవరి 29 (సూర్యసేన) :** కోదాడలో త్వరలో నిర్వహించనున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ పాల్గొనబోతోందనే వార్తల్లో ఎలాంటి నిజం లేదని తెలుగు రైతు సంఘం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి కొల్లు వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో పోటీ చేయడానికి పార్టీ అధిష్టానం నుంచి అనుమతి రాకపోవడంతో పార్టీ తరఫున ఎవరూ బరిలో ఉండబోరని తెలిపారు. గత మున్సిపల్ ఎన్నికల్లో తాను తెలుగుదేశం పార్టీ నుంచి కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేశానని, ఈసారి కూడా పోటీ చేయాలనే ఉద్దేశంతో అన్ని ఏర్పాట్లు చేసుకున్నప్పటికీ అధిష్టానం నుంచి అనుమతి లభించకపోవడంతో క్రమశిక్షణ గల కార్యకర్తగా తన నిర్ణయాన్ని విరమించుకున్నట్లు పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఏ రాజకీయ పార్టీకి అధికారికంగా మద్దతు ఇవ్వడం లేదని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తోందన్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని, అవన్నీ అసత్యాలు, అవాస్తవ ప్రచారాలేనని ఆయన ఖండించారు.

# అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పది




**- అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ ,దేవి రెడ్డి బ్రదర్స్**

**పెన్ పహాడ్, జనవరి 29 (సూర్య సేన) :** అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పదని గ్రామ సర్పంచ్ నాతాల వెంకటరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ బండి మధుసూదన్ రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని గాజుల మల్కాపురం లో రెండవ రోజు కొనసాగుతున్న సమ్మక్క సారలమ్మ జాతరకు విచ్చేసిన భక్తులకు, గ్రామ ప్రజలకు ,క్రీడాకారులకు, దాతలు దేవి రెడ్డి బ్రదర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. అన్నదానం మహాదానం అని సమ్మక్క సారలమ్మ జాతరకు వచ్చిన కొన్ని వేల మందికి అన్నదాన కార్యక్రమం చేపట్టడం ఎంతో పుణ్యఫలమని దేవి రెడ్డి బ్రదర్స్ కుటుంబాలను ఆ సమ్మక్క సారలమ్మ తల్లి ఆశీస్సులు కలిగి వారి కుటుంబాలు అభివృద్ధి చెందాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో దేవి రెడ్డి జానకిరామ్ రెడ్డి, మామిడి వెంకన్న గౌడ్,ఆక్స్ఫర్డ్ టైలర్, ఆక్స్ దీవి రెడ్డి వీరారెడ్డి, సైదిరెడ్డి, లింగారెడ్డి ,వెంకటరెడ్డి, బండి రామకృష్ణారెడ్డి, బండి ఇంద్రసేనారెడ్డి , ఉప సర్పంచ్ సొంటి ఆంజనేయులు, దేవి రెడ్డి శ్రీనివాసరెడ్డి ,లక్ష్మారెడ్డి, సైదిరెడ్డి ,సతీష్ రెడ్డి, జగదీష్ రెడ్డి, బాలకృష్ణ రెడ్డి ,సాయికిరణ్ రెడ్డి, సందీప్ రెడ్డి, వినయ్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, ప్రణీత్ రెడ్డి ,తదితరులు పాల్గొన్నారు

# రైతుబంధుకు రాం,రాం.. చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం

**- బడంగ్పేట భారత రాష్ట్ర సమితి అధ్యక్షులు రామిడి రామిరెడ్డి**



**రంగారెడ్డి, జనవరి 29 (సూర్య సేన) :** అందరూ అనుకున్నట్లుగానే కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం రైతుబంధుకి రాంరాం చెప్పిందని భారత రాష్ట్ర సమితి బడంగపేట అధ్యక్షులు రామిడిరామిరెడ్డి అన్నారు. గురువారం పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేస్తూ అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు కావస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం కేవలం ఒక్కసారి మాత్రమే రైతుబంధు మంజూరు చేసిందని ఇప్పటికి మూడు దఫాలుగా ఇవ్వవలసిన రైతుబంధుపైసలు ఎగ్గొట్టినప్రభుత్వం ఈ ఏడాది కూడా అదే బాటలో వెళుతుందని విమర్శించారు. భారత రాష్ట్ర సమితి అధికారంలో ఉన్న సమయంలో ఎక్కడ అంతరాయం లేకుండారైతుబంధు అందజేసిందనికాంగ్రెస్ పార్టీ మాత్రంఎగ్గొట్టిందని, రామ్ రెడ్డి ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల కోడ్ రావడంతో ఫిబ్రవరిలో కూడా రైతుబంధులేనట్లేననిమార్చిలో కూడా రైతుబంధుఇవ్వకపోతే ముగిసిపోనున్నఆర్థిక సంవత్సరం, రాష్ట్ర ముఖ్యమంత్రిచేతలెత్తేసే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఆర్థిక సంవత్సరం ముగిసిన తర్వాత కొత్త బడ్జెట్ అమల్లోకి వస్తుంది అప్పుడు రైతు బంధు పథకానికి పూర్తిగా మంగళం పాడినట్లేఅనిఅధికారులు సైతం ధ్రువీకరిస్తున్నారనిగతంలో ఇదే సాకుతో ఒక దఫారైతుబంధు ఎగ్గొట్టిందనిరేవంత్ రెడ్డి సర్కార్ పై ఆరోపణలు ఉన్నాయి. 2025 ఆర్థిక సంవత్సరం అయిపోయిందని 80% రైతులకు రైతుబంధు ఎగ్గొట్టినఘనత కాంగ్రెస్కే దక్కుతుందని గెలిచిన తర్వాత ఒక్కసారి మాత్రమే రైతుబంధుఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలు వస్తున్నాయని ఓట్ల కోసం రైతుబంధు ఇచ్చారని 20 23 డిసెంబర్ నుంచి ఇప్పటివరకు మూడు దఫాల రైతుబంధులు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎగనామం పెట్టిందని రైతు సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్న ముఖ్యమంత్రి నిమ్మకు నీరెత్తినట్లుగా ఉన్నారని పెట్టుబడి సాయం లేక పంట సాగు ఎలా చేయాలో రైతులకు పాలుపోవడం లేదని కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయి రైతులకు పంగనామాలు పెట్టిందని ఎద్దేవా చేశారు.

# జెడ్పిహెచ్ఎస్ నకిరేకల్‌లో మండల స్థాయి సీఎం కప్ క్రీడల ప్రారంభం



**నకిరేకల్, జనవరి 29 (సూర్య సేన) :** మండల/పట్టణ స్థాయి సీఎం కప్ 2025--26 క్రీడలను గురువారం నకిరేకల్ పట్టణంలోని జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో ఘనంగా ప్రారంభించారు. ఈ క్రీడలలో కబడ్డీ, వాలీబాల్, కో-కోతో పాటు వివిధ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నారు.

స్థానిక ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు విద్యాసాగర్ రెడ్డి ఆధ్వర్యంలో క్రీడల నిర్వహణ జరుగుతోంది... ఈ పోటీలకు పెద్ద సంఖ్యలో విద్యార్థినీ, విద్యార్థులు హాజరై ఉత్సాహంగా పాల్గొన్నారు. గురువారం నిర్వహించే క్రీడల ద్వారా నియోజకవర్గ స్థాయి సీఎం కప్ పోటీలకు అర్హులైన క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు మండల విద్యాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శ్రీ కిరణ్ కుమార్, మండల అభివృద్ధి అధికారి వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ రంజిత్ కుమార్, మండల విద్యాధికారి ఎం. నాగయ్య, జడ్పిహెచ్ఎస్ పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు సత్యవతి వేదం, మండలంలోని అన్ని పాఠశాలల ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు పాల్గొని క్రీడలను ప్రారంభించారు.




# వార్డు ప్రజలకు అండగా ఉంటాం ఆశీర్వదించి గెలిపించండి

**- 45 వార్డు బిఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి గండూరి పావని కృపాకర్**



**సూర్యాపేట టౌన్, జనవరి 29 (సూర్య సేన) :** వార్డు ప్రజలకు అండగా ఉంటాం ఆశీర్వదించి గెలిపించాలని 45 వార్డు బిఆర్ ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి గండూరి పావని కృపాకర్ అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా రెండో రోజు గురువారం నామినేషన్ దాఖలు చేసి మీడియా సమావేశంలో మాట్లాడారు. వార్డు ప్రజలకు ఏ ఆపద వచ్చినా 365 రోజులు వార్డు ప్రజల సమస్యలే ధ్యేయంగా అహర్నిశలు పాటుపడుతున్నామని తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి హయాంలో సూర్యాపేట పట్టణంతో పాటు తమ వార్డు ఎంతో అభివృద్ధి చెందిందని మూడో పర్యాయం హ్యాట్రిక్ గా అత్యధిక మెజారిటీతో గెలిపించాలని వార్డు ప్రజల్ని కోరారు. గత రెండు పర్యాయాలు వార్డు ప్రజలు తమను ఆదరించి గెలిపించినందుకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా ఈ పర్యాయం కూడా మీ అమూల్యమైన ఓట్లతో వార్డు ను అభివృద్ధి చేసేందుకు శాయశక్తులా కృషి చేస్తామని పేర్కొన్నారు.

# 33, 46 వార్డులకు కౌన్సిలర్ లుగా పోటీ



**– డాక్టర్ వూర రామ్మూర్తి యాదవ్, వూర గాయత్రి దంపతులు**

**సూర్యాపేట టౌన్, జనవరి 29 (సూర్య సేన) :** సూర్యాపేట మున్సిపల్ ఎన్నికల్లో స్థానిక 33 వార్డులో కాంగ్రెస్ పార్టీ తరఫున కౌన్సిలర్ గా నామినేషన్ దాఖలు చేసినట్లు ప్రముఖ వైద్యులు డాక్టర్ రామ్మూర్తి యాదవ్ అన్నారు. 46 వ వార్డు లో తన భార్య అడ్వకేట్ వూర గాయత్రి పోటీ చేస్తున్నట్లు చెప్పారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో డాక్టర్ వూర గాయత్రి రామ్మూర్తి యాదవ్ దంపతులు కౌన్సిలర్ లు గా నామినేషన్ పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మమ్మల్ని కౌన్సిలర్ లుగా గెలిపిస్తే రెండు వార్డుల ప్రజలకు ఉచితంగా వైద్య సౌకర్యం అందజేస్తానని, అంతేకాకుండా మహిళలకు గర్భసంచి కాన్సర్ రాకుండా ఉచితంగా వ్యాక్సిన్ చేస్తామని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సౌకర్యము కల్పిస్తున్నట్లు చెప్పారు. కొత్తగా రేషన్ కార్డుల పంపిణీ , పేదలందరికి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ పార్టీని తరపున పోటి చేస్తున్న మమ్మల్ని ఆదరించాలని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.

# డప్పు కళాకారుడు అమరవరపు సతీష్‌కు సన్మానం



**గరిడేపల్లి, జనవరి 29 (సూర్య సేన) :** సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం బేతవోల్ గ్రామ సర్పంచ్ వట్టికూటి నాగన్న గౌడ్ ఆధ్వర్యంలో డప్పు కళాకారుడు అమరవరపు సతీష్‌ను గురువారం ఘనంగా సన్మానించారు. అప్పన్నపేట గ్రామానికి చెందిన, పెద్ద బజార్ విమల కుమారుడైన అమరవరపు సతీష్ గత కొన్ని సంవత్సరాలుగా అంతరించిపోతున్న తెలంగాణ మట్టి కళారూపమైన డప్పు కళారంగంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నూతన ఒరవడికి కృషి చేస్తున్నారని సర్పంచ్ కొనియాడారు.

మహిళలకు డప్పు కళలో శిక్షణ ఇచ్చి, సూర్యాపేట జిల్లాకు కళారంగంలో ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చారని ఆయన ప్రశంసించారు. సంప్రదాయ కళలను కాపాడడంలో అమరవరపు సతీష్ చేసిన సేవలు అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఇట్టిమల్ల ఏడుకొండలు, బెల్లంకొండ వీరయ్య గౌడ్, యరమళ్ళ వెంకటేశ్వర్లు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి కానుగు శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# జిపిఓల మండల కమిటీ ఎన్నిక...



**అధ్యక్షులు ఆదిత్య**



**ప్రధాన కార్యదర్శి మధు**

పెన్ పహాడ్, జనవరి 29 (సూర్య సేన): పెన్ పహాడ్ మండల పాలన అధికారుల (జిపిఓ) కమిటీ సమావేశం మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడిగా ఎం.ఆదిత్య, ఉపాధ్యక్షులుగా పి.పిచ్చమ్మ, ప్రధాన కార్యదర్శిగా ఆర్. మధు బాబు, కోశాధికారిగా జి. సంధ్య, గౌరవ సలహాదారులుగా ఎల్. గురుస్వామి, గౌరవ సభ్యులుగా ఎం. యాదగిరి, బి. చంద్రకళ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ఆదిత్య మాట్లాడుతూ గ్రామ పాలన అధికారుల సమస్యల పరిష్కారానికి ముందుండి పనిచేస్తానని, అన్ని శాఖల అధికారులతో సమన్వయంతో పనిచేసి గ్రామ పాలనాధికారుల హక్కుల సాధనకు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా నూతన కమిటీకి తహసిల్దార్ లాలూ నాయక్ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మేడారంలో భగ్గుంటున్న ధరలు



**వరంగల్ , జనవరి 29 (సూర్య సేన) :** మేడారం జాతర ప్రారంభమైంది. వనదేవతల దర్శనానికి భక్తులు భారీగా తరలివస్తున్నారు. అయితే, జాతర నేపథ్యంలో కొబ్బరికాయల నుంచి కోళ్లు, మేకల ధరలు, ఇళ్ల అద్దెల వరకు అన్నీ ఆకాశాన్నంటుతున్నాయి. స్థానికులు ఇళ్లలో కనీస వసతులు లేకున్నా అధిక మొత్తంలో అద్దెలు వసూలు చేస్తూ భక్తులను దోచుకుంటున్నారు. చెట్టు నీడకు కూడా కిరాయి వసూలు చేయడం గమనార్హం. ఈ మూడు రోజులు ధరలు మరింత పెరుగుతాయంటున్నారు. పెరిగిన ధరలతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు.తెలంగాణ కుంభమేళా మేడారం జాతర ప్రారంభమైంది. నేటి నుంచి నాలుగు రోజుల పాటు జరగనున్న వనదేవతల జాతరకు భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక, పక్క రాష్ట్రాల నుంచి కూడా భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. తెలంగాణ జాతరకు వెళ్లే భక్తుల కోసం టీజీఆర్టీసీ 4 వేల బస్సులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసింది.దిలా ఉంటే జాతర నేపథ్యంలో మేడారం పరిసర ప్రాంతాల్లో ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. కొబ్బరికాయ మొదలు అమ్మలకు సమర్పించే బంగారం (బెల్లం), కోళ్లు, మేకల ధరలతో పాటు, ఇళ్లు, ప్రత్యేక గదుల అద్దెలను భారీగా పెంచి భక్తులను దోచుకుంటున్నారు. ఆఖరికి చెట్టు నీడకు కూడా కిరాయి వసూలు చేస్తున్నారంటే జాతరలో దోపిడీ ఏ స్థాయిలో జరుగుతుందో ఊహించవచ్చు.మేడారం జాతరలో భాగంగా భక్తులు మొక్కులు చెల్లించుకోవడానికి బంగారం (బెల్లం)తో పాటు కోళ్లు, మేకలను సమర్పిస్తారు. ఇదే అదునుగా మేడారం జాతర వద్ద కోళ్లు, మేకల ధరలను భారీగా పెంచారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు వెంట తీసుకురాలేక, జాతరకు వచ్చాక అక్కడే కొనుగోలు చేస్తుంటారు. ఈ క్రమంలో వ్యాపారులు ధరలను రెట్టింపు చేశారు.మేకపోతు లైవ్ కిలో రూ. 420 ఉండగా, మేడారంలో మాత్రం రూ. 900 నుంచి రూ. 1000 వరకు అమ్ముతున్నారు. మటన్ ధర రూ. 1500 వరకు పలుకుతోంది. బయట రూ. 170-180 కి దొరికే కిలో కోడిని జాతర దగ్గర రూ. 300-350 వరకు అమ్ముతున్నారు. మొన్నటి వరకు కూడా కిలో రూ. 350-400 ఉన్న నాటుకోడిని ఇప్పుడు రూ. 700లకు అమ్ముతున్నారు. జాతర చివరి మూడు రోజుల్లో ఈ ధరలు మరింత పెరిగే అవకాశం ఉంది.ఇళ్ల అద్దెలు కూడా భక్తులకు చుక్కలు చూపిస్తున్నాయి. కనీస వసతి సౌకర్యాలు లేకపోయినా సరే అద్దెలు ఆకాశాన్నంటాయి. ఆఖరికి చెట్ల నీడలో సేదతీరడానికి కూడా అద్దెలు వసూలు చేస్తున్నారు. పిల్లలు, వృద్ధులతో వచ్చిన భక్తులు ఉండటానికి ఇళ్లు వెతుకుతుండటంతో స్థానికులు భారీ మొత్తంలో అద్దెలు వసూలు చేస్తున్నారు. ఒక్క ఫ్యాన్ తప్ప మరే ఇతర సౌకర్యాలు లేని గదులకు కూడా రోజుకు రూ. 6 వేల వరకు వసూలు చేస్తున్నారు.గదులు దొరకని వారు చెట్ల నీడలో సేదతీరడానికి ప్రయత్నిస్తుండగా, తోట యజమానులు వాటికి కూడా అద్దెలు వసూలు చేస్తున్నారు. జాతరకు దగ్గరలో తోటలున్న స్థానికులు భక్తులకు చెట్లను అద్దెకు ఇస్తున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేయడానికి ఒక్కో చెట్టుకు రూ. 1000 చొప్పున వసూలు చేస్తున్నారు.

# 'సింహం' గుర్తుపై జాగృతి అభ్యర్థుల పోటీ

**హైదరాబాద్ , జనవరి 29 (సూర్య సేన) :** తెలంగాణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ జాగృతి, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కలిసి పోటీ చేయనున్నాయి. జాగృతి అభ్యర్థులు ఫార్వర్డ్ బ్లాక్ 'సింహం' గుర్తుపై పోటీ చేయనున్నారు. ఇక తొలిరోజు 902 నామినేషన్లు దాఖలు కాగా.. ఫిబ్రవరి 11న పోలింగ్ జరగనున్న సంగతి తెలిసిందే.తెలంగాణ మున్సిపల్ ఎన్నికల నగారా మోగడంతో రాష్ట్ర రాజకీయాలు హీటెక్కాయి. ప్రధాన పార్టీలతో పాటు చిన్న పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు తమ వ్యూహాలకు పదును పెడుతున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత మద్దతుదారులు ఎన్నికల బరిలో నిలిచేందుకు సిద్ధమయ్యారు. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీతో కలిసి పోటీ చేసేందుకు రెడీ అయ్యారు.ఈ మేరకు జాగృతి అధ్యక్షురాలు కవిత, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర నాయకత్వం మధ్య జరిగిన కీలక చర్చలు ఫలించాయి. రానున్న పురపాలక ఎన్నికల్లో తెలంగాణ జాగృతికి చెందిన ఔత్సాహిక అభ్యర్థులు ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీకి చెందిన 'సింహం' గుర్తుపై పోటీ చేయాలని నిర్ణయించారు. కేవలం ఈ ఎన్నికలకే పరిమితం కాకుండా.. భవిష్యత్తులో కూడా ప్రజా సమస్యలపై ఉమ్మడిగా పోరాడాలని ఇరు పక్షాలు అంగీకారానికి వచ్చాయి. హైదరాబాద్‌లోని ఫార్వర్డ్ బ్లాక్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశం, కొత్త రాజకీయ సమీకరణాలకు నాంది పలికింది.

# ఒక్కరోజే రూ. 23 వేలు పెరిగిన వెండి....



**ముంబై, జనవరి, 29 (సూర్యసేన ప్రతినిధి):** దేశీయ మార్కెట్లో వెండి ధరలు మరో కొత్త మైలురాయిని అధిగమించాయి. ఒక రోజు సెలవు తర్వాత ప్రారంభమైన ట్రేడింగ్ సెషన్‌లో ఎంసీఎక్స్ వెండి కిలో ఏకంగా రూ. 23 వేలకు పైగి రూ. 3.65 లక్షలకు కొత్త జీవితకాల గరిష్ఠానికి చేరాయి. ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ ప్రకారం, హైదరాబాద్ మార్కెట్లో మంగళవారం వెండి కిలో రూ. 22 వేలు పెరిగి రూ. 3.87 లక్షలకు చేరింది. ఇదే సమయంలో స్వచ్ఛమైన బంగారం 10 గ్రాములు స్వల్పంగా రూ. 770 తగ్గి రూ. 1,62,060కి చేరింది. ఆభరణాల తయారీ ఉపయోగించే 22 క్యారెట్ల పసిడి రూ. 700 తగ్గి రూ. 1,48,450 వద్ద ఉంది. ప్రపంచ ఆర్థిక, భౌగోళిక రాజకీయ అనిశ్చితి, పారిశ్రామిక డిమాండ్ వంటి పరిస్థితుల కారణంగా వెండి ధరలు ఈ నెలలో ఇప్పటివరకు 18 శాతం పెరిగాయి. సరఫరా పరిమితం కావడం, ఇన్వెస్టర్లలో రిస్క్ తీసుకునే సామర్థ్యం పెరగడం కూడా ఇందుకు మద్దతిచ్చాయి. గ్లోబల్ మార్కెట్లలోనూ వెండి ధరలు భారీగా పెరిగాయి. గతేడాది జనవరిలో ఔన్స్ వెండి 30 డాలర్లు ఉండగా, ప్రస్తుతం ఇది ఏకంగా 111 డాలర్లకు చేరింది. కేవలం ఏడాది వ్యవధిలో వీటి ధరలు 270 శాతం పెరగడం గమనార్హం. ఈ ఏడాదిలోనే ఇప్పటివరకు 50 శాతం పెరిగింది. స్పాట్ గోల్డ్ ఔన్స్ ధర 5,071 డాలర్లతో స్వల్పంగా దిగొచ్చింది. మరోవైపు, భారత ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి అందించ సానుకూల సంకేతాలతో పాటు ప్రతిష్ఠాత్మక ఇండియా-ఈయూ డీల్ లాభాలకు కారణమయ్యాయి. ఇదే సమయంలో భారత కరెన్సీ రూపాయి కొంత బలపడటం, ముడిచమురు ధరలు దిగి రావడంతో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ పుంజుకుంది. దీంతో మార్కెట్లు ముగిసే సమయానికి సెన్సెక్స్ 319.78 పాయింట్లు పెరిగి 81,857 వద్ద, నిఫ్టీ 126.75 పాయింట్లు లాభపడి 25,175 వద్ద ముగిశాయి. అమెరికా డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ రూ. 91.58 వద్ద ఉంది.


ఇదే సమయంలో స్వచ్ఛమైన బంగారం 10 గ్రాములు స్వల్పంగా రూ. 770 తగ్గి రూ. 1,62,060కి చేరింది. ఆభరణాల తయారీ ఉపయోగించే 22 క్యారెట్ల పసిడి రూ. 700 తగ్గి రూ. 1,48,450 వద్ద ఉంది.

## ఆర్థిక సర్వే అంచనాలను వాస్తవ వృద్ధి అధిగమిస్తోంది!

**ముంబై, జనవరి, 29 (సూర్యసేన ప్రతినిధి):** మనదేశ ఆర్థిక వృద్ధి గణాంకాలను పరిశీలిస్తే, ఆర్థిక సర్వేలో ప్రకటించిన అంచనాలను తరచుగా అధిగమిస్తున్నాయి. బడ్జెట్ ముందస్తు పత్రం (ప్రీ-బడ్జెట్ డాక్యుమెంట్)లో అంచనా వేసిన 6.3-6.8% వృద్ధికి మించి 2025-26 ఆర్థిక సంవత్సరంలో 7.4% వృద్ధిరేటు నమోదవుతుందని అంచనా. 2023-24 ఆర్థిక సర్వేలో జీడీపీ వృద్ధి 6-6.8 శాతమని అంచనా వేయగా, అది 9.2 శాతంగా నమోదైంది. 2024-25లో మాత్రం ఆర్థిక సర్వే అంచనా 6.5-7 శాతానికి అనుగుణంగా, 6.5 శాతంగా నమోదైంది. 2022-23లో లక్ష్యం నెరవేరలేదు. వాస్తవిక ఆర్థిక వృద్ధి 7.65% ఉండగా, ఆర్థిక సర్వే అంచనా 8-8.5 శాతంగా ఉంది. 2021-22లో కొవిడ్ కారణంగా ఆర్థిక సర్వే ఎలాంటి అంచనాలను వేయలేదు. కానీ బేస్ ప్రభావం కారణంగా 9.7% వృద్ధి నమోదైంది. 2020-21లో కొవిడ్ ప్రభావం, తదనంతర లాక్‌డౌన్‌ల కారణంగా 5.8% ప్రతికూల వృద్ధి నమోదైంది. ఫిబ్రవరి 1న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుండగా, దీనికి ఒకరోజు ముందు ఆర్థిక సర్వేను వెల్లడిస్తారు.



## ఆల్ టైం కనిష్టానికి ఇరాన్ కరెన్సీ.. డాలరుకు 15 లక్షల రియాల్స్




**ముంబై, జనవరి, 29 (సూర్యసేన ప్రతినిధి):** ఇరాన్ కరెన్సీ అయిన ఇరానియన్ రియాల్ మళ్లీ భారీగా పడిపోయింది. ఓపెన్ మార్కెట్‌లో ఒక అమెరికన్ డాలర్‌కు ఆల్ టైమ్ కనిష్టంగా సుమారు 14.7 లక్షల నుంచి 15 లక్షల రియాల్స్ వరకు డౌన్ అయింది. ఇది ఇరాన్ చరిత్రలోనే అత్యల్ప స్థాయి కావడం గమనార్హం. 2025 చివరితో పోలిస్తే రియాల్ విలువ దాదాపు 20 నుంచి 30 శాతం వరకు పడిపోయింది. అయితే ఇరాన్ సెంట్రల్ బ్యాంక్ ప్రకటించే అధికారిక రేటు సుమారు 42 వేల రియాల్స్‌గా ఉన్నప్పటికీ, ఆ రేటును సాధారణంగా ఎవరూ ఉపయోగించరు. దేశంలో వాస్తవంగా జరిగే లావాదేవీలు అన్నీ ఓపెన్ మార్కెట్ రేటు ప్రకారమే జరుగుతున్నాయి. ఇరాన్ కరెన్సీ పతనానికి అనేక కారణాలు ఉన్నాయి. ముఖ్యంగా అమెరికా సహా పశ్చిమ దేశాల ఆర్థిక ఆంక్షల వల్ల ఇరాన్‌కు చమురు ఎగుమతులు తగ్గాయి. విదేశీ కరెన్సీ దేశంలోకి రావడం బాగా తగ్గిపోయింది. మరోవైపు దేశంలో ద్రవ్యోల్బణం తీవ్రంగా పెరిగింది. 2025 డిసెంబర్ నాటికి ఇన్‌ఫ్లేషన్ 40 శాతానికి పైగా ఉండగా, ఆహార పదార్థాల ధరలు 70 శాతం కంటే ఎక్కువగా పెరిగాయి. ధరల పెరుగుదలతో ప్రజలు ఆందోళనకు గురై దేశవ్యాప్తంగా నిరసనలు కూడా చేశారు. ప్రభుత్వం తీసుకున్న కొన్ని ఆర్థిక నిర్ణయాలు, సబ్సిడీల తగ్గింపు, ఫారెక్స్ నియమాల్లో మార్పులు కూడా పరిస్థితిని మరింత దిగజారేలా మార్చాయి. ఇది సాధారణ ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఒక డాలర్‌కు 15 లక్షల రియాల్స్ అంటే దిగుమతి చేసుకునే ఆహారం, మందులు, టెక్నాలజీ వస్తువుల ధరలు భారీగా పెరిగిపోయినట్టేనని నిపుణులు చెబుతున్నారు. బ్రెడ్, మాంసం, ఔషధాలు వంటి అవసరమైన వస్తువులు కూడా సామాన్యులకు అందని స్థితికి చేరుతున్నాయి. ఇరాన్ ఇప్పుడు హైపర్ ఇన్‌ఫ్లేషన్ దశకు చేరిందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. అందుకే ప్రజలు తమ డబ్బు విలువ కాపాడుకోవడానికి డాలర్లు, బంగారం, క్రిప్టో కరెన్సీల్లో పెట్టుబడి పెడుతున్నారు. ప్రభుత్వం, సెంట్రల్ బ్యాంక్ మాత్రం దీనిని సహజ ప్రక్రియగా చెబుతున్నా, ఆర్థిక నిపుణులు ఇది తీవ్రమైన ఆర్థిక సంక్షోభమని, రాబోయే రోజుల్లో మరిన్ని నిరసనలకు దారితీసే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. మరోవైపు ఇరాన్ రియాల్ ప్రపంచంలోనే అతి తక్కువ విలువ గల కరెన్సీల జాబితాలో ఒకటిగా చేరింది.


## హల్వా వేడుకలో పాల్గొన్న ఆర్థిక మంత్రి నిర్మలమ్మ



**ముంబై, జనవరి, 29 (సూర్యసేన ప్రతినిధి):** మరో మూడు రోజుల్లో కేంద్ర బడ్జెట్ వెలువడనున్న నేపథ్యంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారంనాడు సాంప్రదాయ 'హల్వా' వేడుకలో పాల్గొన్నారు. ఫిబ్రవరి 1న లోక్‌సభలో ప్రవేశపెట్టనున్న 2026-27 కేంద్ర బడ్జెట్ తయారీకి ఇది చివరి దశను సూచిస్తుంది. కర్తవ్య భవన్-ఈలోని కొత్త ప్రాంగణంలో ప్రింటింగ్ ప్రెస్ లేకపోవడంతో ఆర్థిక మంత్రిత్వ శాఖ పాత కార్యాలయం రాయ్‌సినా హిల్‌లోని నార్త్ బ్లాక్‌లో ఈ వేడుక జరిగింది.


ఆర్థిక మంత్రి, ఆమె బృందంలోని చాలా మందిని గతేడాది సెప్టెంబర్‌లో ప్రతిష్ఠాత్మక నార్త్ బ్లాక్ నుంచి కర్తవ్య భవన్‌లో ఉన్న కొత్త కేంద్ర సచివాలయ కార్యాలయానికి మారిన సంగతి తెలిసిందే. ఈ వేడుకలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో పాటు సహాయమంత్రి పంకజ్ చౌదరీ, ఆర్థిక శాఖలోని పలు విభాగాల కార్యదర్శులు, బడ్జెట్ రూపొందించడంలో భాగస్వామ్యం ఉన్న అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం తర్వాత బడ్జెట్ ప్రెస్‌ను పరిశీలించిన ఆర్థిక మంత్రి, ప్రింటింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. హల్వా వేడుక అంటే బడ్జెట్ లాక్-ఇన్?పీరియడ్. ఈ ప్రక్రియ బడ్జెట్ తయారీలో ప్రత్యక్షంగా పాల్గొనే అధికారులు, సిబ్బంది పార్లమెంట్‌లో వార్షిక పద్దును ప్రవేశపెట్టేవరకు ఆ నార్త్ బ్లాక్‌లోనే ఉంటారు. బడ్జెట్ ప్రకటన ముగిసేంతవరకు ఎవ్వరూ బయటకు వెళ్లేందుకు అవకాశం ఉండదు. అందరూ సీసీటీవీ కెమెరాలు, భద్రతా సిబ్బంది నిఘాలో ఉంటారు. పార్లమెంట్‌లో నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగం పూర్తయిన తర్వాత వారందరూ బయటకు వస్తారు. ఐదురోజులపాటు వారు నార్త్ బ్లాక్‌లోనే ఉంటారు. 1950లో బడ్జెట్ ముద్రణ ప్రక్రియ కొనసాగుతున్న సమయంలో లీక్ అయిన ఘటన కారణంగా ఈ లాక్-ఇన్ ప్రక్రియ అమల్లోకి వచ్చింది. కేంద్ర బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టనున్నారు.

## టారిఫ్‌ల కంటే కాలుష్యమే భారత్‌కు అతిపెద్ద ముప్పు





**ముంబై, జనవరి, 29 (సూర్యసేన ప్రతినిధి):** భారత ఆర్థికవ్యవస్థకు వాణిజ్య సుంకాల కంటే కాలుష్యమే అతిపెద్ద ప్రమాదకారిగా ఉందని అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ(ఐఎంఎఫ్) మాజీ ప్రధాన ఆర్థికవేత్త గీతా గోపీనాథ్ హెచ్చరించారు. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సు(డబ్ల్యూఈఎఫ్) కార్యక్రమంలో మాట్లాడిన ఆమె.. కాలుష్యం నిశ్శబ్దంగా భారత దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధికి అత్యంత తీవ్రమైన ప్రమాదాలలో ఒకటిగా మారుతోందన్నారు. దేశంలో కాలుష్యం క్లిష్టమైన సవాలు, భారత ఆర్థికవ్యవస్థపై దాని ప్రభావం ఇప్పటివరకు విధించిన సుంకాల ప్రభావం కంటే చాలా ఎక్కువగా ఉండనుంది. కాలుష్యం చాలా ఎక్కువగా ప్రభావితం చేస్తుంది. ఇది కార్మికుల ఉత్పాదకతను తగ్గిస్తుంది, ఆరోగ్య సంరక్షణ ఖర్చులను పెంచుతుంది.

## ఎఫ్‌టీఏతో యూరప్‌లో భారతీయ ఐటీ సంస్థలకు మెరుగైన అవకాశాలు




**ముంబై, జనవరి, 29 (సూర్యసేన ప్రతినిధి):** ప్రతిష్టాత్మక ఇండియా-యూరోపియన్ యూనియన్(ఈయూ) స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం(ఎఫ్‌టీఏ) జరగడం పట్ల ఐటీ పరిశ్రమల సంఘం నాస్కామ్ హర్షం వ్యక్తం చేసింది. ఈ ఒప్పందం ద్వారా దేశంలోని టెక్ పరిశ్రమకు మెరుగైన ఈయూ మార్కెట్ యాక్సెస్ లభిస్తుంది. ప్రస్తుతం యూరప్ భారతీయ ఐటీ సేవల సంస్థలకు ఆశాజనకమైన కేంద్రంగా అభివృద్ధి చెందుతోంది. టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సీఎల్ టెక్ లాంటి సంస్థలు విస్తరిస్తున్నాయి. ఎఫ్‌టీఏ ద్వారా ఆయా కంపెనీలకు మరిన్ని ఒప్పందాలను సాధించడానికి సహాయపడుతుంది. వస్తువులపై గణనీయంగా సుంకాలు తగ్గనున్నప్పటికీ, సేవల రంగ లాభాల వల్ల మార్కెట్లో మరింత యాక్సెస్ లభిస్తుందని, నిబంధనల సడలింపు కలిసొస్తుందని నాస్కామ్ అభిప్రాయపడింది. ముఖ్యంగా ఎఫ్‌టీఏ ఖరారు కావడంతో భారతీయ ఐటీ ప్రొఫెషనల్స్‌కు అవకాశాలు మెరుగుపడతాయి. స్కిల్స్ ఉన్న ఉద్యోగులను సులభంగా బదిలీ చేయవచ్చని, సేవలను సజావుగా సరిహద్దు దాటేందుకు, సురక్షితమైన డేటా సరఫరాకు వీలవుతుంది. ఈ ఒప్పందంలో టెక్నాలజీ చిన్న భాగం కాదని నిపుణులు అంటున్నారు. ఇది భారత్‌ను ప్రపంచ ఐటీ లీడర్‌గా గుర్తిస్తుంది. డిజిటల్ వాణిజ్యం, ఈ-సేవలు, డేటా భద్రత, డిజిటల్ అథంటికేషన్‌ను ప్రోత్సహిస్తుంది. భారతీయ టెక్ కంపెనీలు యూరప్ డిజిటల్ ఆర్థిక వ్యవస్థతో మరింత లోతుగా కనెక్ట్ అవ్వడానికి సహాయపడుతుందని నాస్కామ్ పేర్కొంది.

## కొత్త భారత్ యాత్ర ట్రావెల్ కార్డును విడుదల చేసిన క్విక్-కామర్...




**ముంబై, జనవరి, 29 (సూర్యసేన ప్రతినిధి):** ప్రముఖ క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్ బ్లింక్‌ఇట్ కొత్త ట్రావెల్ కార్డును విడుదల చేసింది. తన ప్లాట్‌ఫామ్ ద్వారా భారత యాత్ర పేరుతో తెచ్చిన ఈ కార్డు నేషనల్ కామన్ మొబిలిటీ కార్డ్(ఎన్‌సీఎంసీ) ఆధారంగా పనిచేస్తుంది. బ్లింక్‌ఇట్ ఈ కార్డును ఢిల్లీ ఎన్‌సీఆర్, బెంగళూరు, ముంబై, చెన్నై, అహ్మదాబాద్‌లలో అందుబాటులోకి తెచ్చింది. దీని ధర రూ. 50 ఉంటుందని, ఎలాంటి కేవైసీ ప్రక్రియ అవసరం లేదని కంపెనీ తెలిపింది. ఇదే సమయంలో ఒక్కో సిటీలో ఒక్కో ట్రావెల్ కార్డుల అవసరాన్ని కూడా తొలగిస్తుందని బ్లింకిట్ మాతృ సంస్థ ఎటర్నల్ గ్రూప్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ)గా త్వరలో బాధ్యతలు స్వీకరించనున్న అల్బిందర్ దిండ్సా అన్నారు. ఇది రూపే ఆధారిత కార్డు, తక్షణం యూపీఐ టాప్-అప్ సౌకర్యంతో పనిచేస్తుంది. దేశంలో వివిధ నగరాల్లో మెట్రో, బస్సులు వంటి ప్రజా రవాణాలో కీలకంగా ఉంటుందని దిండ్సా వివరించారు. ఈ కార్డును భారత్ యాత్ర మొబైల్ అప్లికేషన్ ఉపయోగించి లింక్ చేయడం ద్వారా యాక్టివేట్ చేసుకోవచ్చు. ఇది ఐదేళ్ల కాలపరిమితితో వస్తుందని, వ్యాలెట్‌లో రూ. 2,000 వరకు యాడ్ చేసుకోవచ్చని బ్లింక్‌ఇట్ పేర్కొంది. ప్రస్తుత దీన్ని ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై, అహ్మదాబాద్‌లోని మెట్రోలకు, ముంబై, చెన్నైలోని బస్సు ప్రయాణాలకు ఉపయోగించవచ్చు. భారత్ యాత్ర కార్డ్ ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్ ఫ్లిప్‌కార్ట్‌లో కూడా అందుబాటులో ఉంది.

సూర్యసేన


శుక్రవారం, జనవరి 30, 2026

# మరో హిందీ మూవీలో తమన్నా




తెలుగు, తమిళం, హిందీతోపాటు పాన్ ఇండియా స్థాయిలో సూపర్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న భామల్లో టాప్‌లో ఉంటుంది తమన్నా భాటియా. ఈ ఏడాది తెలుగులో ఓదెల 2 చిత్రంలో లీడ్ రోల్‌లో నటించిన తమన్నా.. హిందీ రైడ్ 2లో కామియో రోల్‌లో మెరిసింది. తాజాగా మరో హిందీ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది తమన్నా. షాహిద్ కపూర్ నటిస్తోన్న తాజా ప్రాజెక్ట్ ఓ రోమియో చిత్రంలో వన్ ఆఫ్ ది లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ మూవీలో తృప్తి డిమ్రి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. విక్రాంత్ మస్సే, దిశా పటాని, నానా పటేకర్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. విశాల్ భరద్వాజ్ డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీని సాజిద్ నడియాడ్‌వాలా నిర్మిస్తున్నారు. బిగ్ బ్జడెట్ ఎంటర్‌టైనర్‌గా వస్తోన్న ఈ చిత్రం హిందీ నుంచి రాబోతున్న మోస్ట్ ఎవెయిటెడ్ ప్రాజెక్టుల్లో ఒకటి కావడంతో అంచనా లు భారీగానే ఉ న్నాయి. ఓ రోమియో షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ భామ ఖాతాలో ఇప్పటికే నాలుగు హిందీ సినిమాలుండగా.. షూటింగ్ దశలో ఉ న్నాయి. మొత్తానికి బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టి టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తోంది మిల్కీ బ్యూటీ.

# 'కన్నెపిట్టరో కన్నుకొట్టరో'.. అదిరిపోయిన అడివి శేష్ 'డెకాయిట్' టీజర్





టాలీవుడ్ నటుడు అడివి శేష్, మృణాల్ ఠాకూర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'డెకాయిట్' ఒక ప్రేమ కథ అనేది ఉపశీర్షిక. ఈ ప్రాజెక్ట్ ద్వారా షానీల్ డియో అనే కొత్త దర్శకుడు ఇండస్ట్రీకి పరిచయం కానున్నాడు. ఇప్పటికే ఈ సినిమా నుంచి ఫస్ట్‌గ్లింప్స్‌ను విడుదల చేయగా మంచి రెస్పాన్స్ దక్కించుకుంది. ఇదిలావుంటే.. తాజాగా ఈ సినిమా నుంచి చిత్రబృందం సినిమా టీజర్‌ను విడుదల చేసింది. నాగార్జున సినిమాలోని ఐకానిక్ సాంగ్ 'కన్నెపిట్టరో కన్నుకొట్టరో' బ్యాక్‌గ్రౌండ్ పాటతో ఈ టీజర్ మొదలవ్వగా.. ఫుల్ యాక్షన్ డ్రామాగా ఈ టీజర్ సాగింది. ఇందులో అడివిశేష్, మృణాల్ ఠాకూర్ దొంగలుగా నటించబోతున్నట్లు తెలుస్తుంది. ఈ భారీ బడ్జెట్ పాన్ ఇండియా చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తుంది. బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్ ఈ చిత్రంలో కీలక పాత్రలో నటిస్తుండగా.. మార్చి 19న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.

# నాగబంధం క్లైమాక్స్ కోసమే అన్ని కోట్లా..?



టాలీవుడ్ నుంచి పాన్ ఇండియా స్థాయిలో సినిమాలు తెరకెక్కించి వన్ ఆఫ్ దిలీడింగ్ ప్రొడ్యూసర్ కమ్ డైరెక్టర్‌గా నిలిచిన వారిలో ఒకరు అభిషేక్ నామా. డెవిల్ తర్వాత ఈ ప్రొడ్యూసర్ కమ్ డైరెక్టర్ నుంచి వస్తున్న చిత్రం నాగబంధం. అడ్వెంచరస్ మైథలాజికల్ డ్రామా నేపథ్యంలో పద్మనాభస్వామి, పూరీ జగన్నాథ్ ఆలయాల్లో గుప్త నిధుల ఆవిష్కరణల స్ఫూర్తిగా వస్తోన్న ఈ చిత్రంలో పెదకాపు సినిమాతో హీరోగా ఎంట్రీ ఇచ్చిన విరాట్ కర్ణ లీడ్ రోల్‌లో నటిస్తు న్నాడు. ఈ మూవీ క్లైమాక్స్ ఇదివరకెన్నడూ లేని విధంగా చిత్రీకరిస్తు న్నారట. తాజా టాక్ ప్రకారం ప్రొడక్షన్ డిజైనర్ అశోక్ కుమార్ రామానాయుడు స్టూడియోస్‌లో నిర్మించిన అద్భుతమైన మైథలాజికల్ సెట్‌లో క్లైమాక్స్‌ను షూట్ చేస్తున్నారు. ఈ సీక్వెన్స్ కోసం ఏకంగారూ. 20కోట్లు ఖర్చు చేస్తున్నారంటే విజువల్స్ ఏరేంజ్‌లో ఉండబోతు న్నాయో అర్థం చేసుకోవచ్చు. గ్లోబల్ యాక్షన్ అడ్వెంచరస్ కొరియో గ్రఫర్‌ఈ హై ఆక్టేన్ సీక్వెన్స్‌ను షూట్ చేస్తున్నట్టు సమా చారం. ఈ చిత్రంలో ఇస్మార్ట్ భామ నభానటేశ్, ఐశ్వర్య మీనన్ ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. అభిషేక్ పిక్చర్స్, నిక్ స్టూడియోస్,తారక్ సి నిమాస్ బ్యానర్లపై అభిషేక్ నామా, కిశోర్ అన్నపురెడ్డి,లక్ష్మి ఐరాసం యుక్తంగా నిర్మిస్తున్నారు. పాన్ ఇండియా బ్యాక్ డ్రాప్ స్టోరీ నేపథ్యంలో వస్తోన్న ఈ సినిమాకు సంబంధించిన ఆసక్తికర వార్తను షేర్‌చేశారు మేకర్స్.

# "నా రూమ్‌లో ఆత్మ కనిపించింది": కృతి శెట్టి



యువ కథానాయిక కృతి శెట్టి ఇటీవల ఒక ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెన్నులో వణుకు పుట్టించే అనుభవాన్ని పంచుకున్నారు. సినిమా షూటింగ్‌కు ఒక్క రోజు ముందు హోటల్ రూమ్‌లో తనకూ, తన అమ్మకూ ఆత్మలాంటి ఆకారం కనిపించిందని పేర్కొన్నారు. ఈ సంఘటన ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. 'ఉప్పెన' చిత్రంతో ఒక్కసారిగా స్టార్‌డమ్ అందుకున్న కృతి శెట్టి, తరువాత వరుస సినిమాల్లో నటించినప్పటికీ పెద్ద విజయాలు అందుకోలేకపోయింది. దీంతో తమిళం, మలయాళం రంగాల్లో అవకాశాలపై దృష్టి పెట్టిన ఆమె ప్రస్తుతం కార్తీ హీరోగా నటించిన వా వాతియర్ (తెలుగులో 'అన్నగారు వస్తారు') మూవీ ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది. ఈ క్రమంలో కృతి మాట్లాడుతూ.. అన్నగారు వస్తారు షూటింగ్‌కు ఒక రోజు ముందు నేను, మా అమ్మ హోటల్‌లో ఉండగా ఆత్మ లాంటి ఆకారం కనిపించిందని చెప్పింది. వెంటనే లైట్ ఆన్ చేయగానే పెద్ద శబ్దంతో ఆ ఆకారం మాయమైందని చెప్పింది.

# 'డేవిడ్ రెడ్డి'లో చరణ్, శింబు గెస్ట్ రోల్స్‌పై స్పందించిన మంచు మనోజ్



రాకింగ్ స్టార్ మంచు మనోజ్ హీరోగా నటిస్తున్న పాన్-ఇండియా చిత్రం 'డేవిడ్ రెడ్డి'. ఈ సినిమాలో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, నటుడు శింబు అతిథి పాత్రల్లో కనిపించనున్నారంటూ గత కొన్ని రోజులుగా వస్తున్న ప్రచారానికి మనోజ్ తెరదించారు. ఆ వార్తల్లో నిజం లేదని, ఇప్పటివరకూ ఆ పాత్రల కోసం తాము ఎవరినీ సంప్రదించలేదని స్పష్టం చేశారు. హనుమరెడ్డి యక్కంటి దర్శకత్వంలో పీరియాడిక్ యాక్షన్ చిత్రంగా 'డేవిడ్ రెడ్డి' తెరకెక్కుతోంది. బుధవారం హైదరాబాద్‌లో ఈ చిత్రం టీజర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మీడియా అడిగిన ప్రశ్నకు మనోజ్ బదులిస్తూ.. "సినిమాలో అతిథి పాత్రలకు మంచి స్కోప్ ఉంది. కానీ, ఆ పాత్రల కోసం ఇంకా ఎవరినీ ఫైనల్ చేయలేదు. దానికి ఇంకా చాలా సమయం ఉంది. సమయం వచ్చినప్పుడు తప్పకుండా ఆ వివరాలు నేనే వెల్లడిస్తాను" అని వివరించారు. ఈ సినిమాలో 'వార్ డాగ్' అనే ప్రత్యేకమైన బైక్ కీలక పాత్ర పోషిస్తుందని మనోజ్ తెలిపారు. ప్రభాస్ నటించిన 'కల్కి' చిత్రంలోని 'బుజ్జి' కారును రూపొందించిన బృందమే ఈ బైక్‌ను కూడా తయారు చేసిందని చెప్పారు. సుమారు 700 కేజీల బరువుండే ఈ బైక్ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని ఆయన అన్నారు. మనోజ్ సినీ పరిశ్రమలో 21 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆగస్టులో ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును ప్రకటించారు. ప్రస్తుతం సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది.

# తారాపథంలో తిరుగులేని విజయాలు



కథానాయికలు రష్మిక మందన్న, రుక్మిణి వసంత్ ఈ ఏడాది అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు. సినిమాలకు సంబంధించిన విశ్వసనీయ సమాచారాన్ని, రేటింగ్స్‌ను అందిస్తూ సినీ ప్రేమికుల అభిమానాన్ని పొందిన ఇంటర్నెట్ మూవీ డేటాబేస్ (ఐఎండీబీ) సంస్థ ఈ ఏడాది భారతీయ సినిమాలో వివిధ కేటగిరీలలో అత్యంత ప్రజాదరణ పొందిన నటీనటులు, దర్శకుల జాబితాను విడుదల చేసింది. ఇందులో రష్మిక మందన్న, రుక్మిణి వసంత్ చోటు సంపా దించారు. రష్మిక మందన్న ఈ ఏడాది తిరుగులేని విజయాలను సాధించింది. ఆమె నటించిన 'ఛావా' 'థామా' 'కుబేర' 'గర్ల్‌ఫ్రెండ్' చిత్రాలు ప్రేక్షకాదరణ పొందాయి. ఇక రుక్మిణి వసంత్ 'కాంతార చాప్టర్-1'తో దేశవ్యాప్తంగా పాపులర్ అయింది. దీనితో పాటు 'ఏస్' 'మదరాసి' చిత్రాలు సైతం ఈ భామకు మంచి గుర్తింపును తెచ్చాయి. ఇక ఐఎండీబీ జాబితాలో హిందీ చిత్రం 'సైయారా' జోడీ అహాన్ పాండే,అనీత్ పడ్డా తొలి రెండుస్థానాలను కైవసం చేసుకున్నారు. 40కోట్ల బడ్జెట్‌తో తీసిన 'సైయారా' బాక్సాఫీస్ వద్ద 400కోట్లకుపైగా వసూళ్లనుసాధించడం విశేషం. 'కూలీ' చిత్రంలోఅతిథి పాత్రలో మెరి సిన అమీర్‌ఖాన్ మోస్ట్‌పాపులర్ యాక్టర్స్ జాబితాలో మూడో స్థానంలో నిలిచారు. దర్శకులు మోహిత్ సూరి (సయారా), లోకేష్ కనకరాజ్ (కూలీ), అనురాగ్‌కశ్యప్ (నిశాంచి, బందర్) అత్యంత ప్రజాదరణ పొందిన దర్శకులుగా తొలి మూడు స్థానాల్లో నిలిచారు.

# 1000 కోట్ల ప్రాజెక్ట్‌పై కోలీవుడ్‌లో భారీ చర్చ

భారీ బడ్జెట్, అత్యాధునిక సాంకేతికత, భారీ విజువల్స్ .. ఈ మూడు పదాలు చెప్పగానే గుర్తుకు వచ్చే పేరు దర్శకుడు శంకర్. 'జెంటిల్‌మన్' నుండి 'రోబో' వరకు భారతీయ సినిమాకు కొత్త దారులు చూపించిన ఈ మెగా డైరెక్టర్ ఈ మధ్య కాలంలో అనుకున్న స్థాయి ఫలితాలు అందుకోకపోవడంతో విమర్శల పాలయ్యారు. '2.0'కి వచ్చిన మిక్స్ రెస్పాన్స్, ఆ తర్వాత 'ఇండియన్ 2', 'గేమ్ ఛేంజర్' డిజాస్టర్ ఫలితాలు శంకర్ ప్రతిష్టను గణనీయంగా దెబ్బతీశాయి. ఈ నేపథ్యంలో ఆయన తీసుకునే ప్రతి నిర?యం నిర్మాతలలో ఆందోళన కలిగిస్తోంది. తాజాగా జరిగిన ఓ ఈవెంట్‌లో శంకర్ చేసిన కీలక ప్రకటన ఇప్పుడు తమిళ-తెలుగు సినీ వర్గాల్లో పెద్ద చర్చకు దారి తీసింది. ప్రముఖ రచయిత సు.వెంకటేశన్ రాసిన నవల వేల్పారి ఆధారంగా భారీ సినిమా తీయబోతున్నట్లు ఆయన తెలిపారు. ఏకంగా లక్షకు పైగా కాపీలు అమ్ముడైన చారిత్రక నవల 'వేల్పారి'. దీనిపై సినిమా అంటే అందరిలో ఆసక్తి మరింత పెరిగింది. 'గేమ్ ఆఫ్ థ్రోన్స్', 'అవతార్' స్థాయి టెక్నాలజీని ఈ సినిమాలో ఉపయోగిస్తాను అని శంకర్ వెల్లడించారు. దీంతో ఈ సినిమా బడ్జెట్ రూ.1000 కోట్లకు పైగానే ఉండే అవకాశం ఉందని కోలీవుడ్ టాక్. శంకర్ భారీ బడ్జెట్, షూటింగ్ ఆలస్యం, ఎక్కువ ఖర్చులు నిర్మాతలకు భయానకంగా మారింది. 'ఇండియన్ 2' ఆలస్యం వల్ల లైకా ప్రొడక్షన్స్ భారీ నష్టాలు వచ్చాయి. 'గేమ్ ఛేంజర్' తో దిల్ రాజుకు భారీ ఒత్తిడి నెలకొంది. ఇలాంటి సమయంలో 1000 కోట్ల చారిత్రక చిత్రం తీసేందుకు ఏ నిర్మాత ముందుకు వస్తారు? ఈ స్థాయి సినిమాకు స్టార్ హీరో డేట్స్ ఇస్తారా ? అనే ప్రశ్నలు ఫిల్మ్ సర్కిల్స్‌లో తీవ్రంగా వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్ కాన్సెప్ట్ స్టేజ్ లో ఉందనే సమాచారం. ప్రొడ్యూసర్, స్టార్ కాస్ట్, షూటింగ్ ప్లాన్‌పై ఎలాంటి క్లారిటీ లేదు.

E-PAPER

visit us @ http://e-paper.sooryasena.com



www.sooryasena.com

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **PALVAI JANAIAH,** PRINTED AT **R K ART PRINTERS,** H.NO. 1-9-277/23/B, VIDYANAGAR, NALLAKUNTA, HYDERABAD-500044, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 2-1-115/3/16/1, MAMILLAGADDA, SURYAPET-508213,NALGONDA DISTRICT, TELANGANA STATE. **EDITOR : PALVAI JANAIAH,** **RNI. No: TELTEL/2023/85598,** CELL: 9951241048, EMAIL : srptsurya@gmail.com